


# అసలు క్షేత్ర స్థాయిలో విధులు నిర్వర్తిస్తున్నారా!

**- ఎన్‌సిడి-సిడి సర్వే ఎందుకు ముందుకు సాగడం లేదు - మెడికల్ ఆఫీసర్లపై కలెక్టర్ ఫైర్**

చిత్తూరు, జూన్ 9 ప్రభాతవార్త: క్షేత్ర స్థాయిలో ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు ఏం విధులు నిర్వహిస్తున్నారు! ఎన్‌సిడి-సిడి సర్వే ఎందుకు త్వరితంగా పూర్తి కావడం లేదని మెడికల్ ఆఫీసర్లు, క్షేత్ర స్థాయి సిబ్బందిపై కలెక్టర్ సగిలి షన్మోహన్ సీరియస్ అయ్యారు. కలెక్టరేట్‌లో శుక్రవారం కలెక్టర్ సగిలి షన్మోహన్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్లు, క్షేత్ర స్థాయి సిబ్బందితో ఎన్‌సిడి-సిడి సర్వే, ఫ్యామిలీ డాక్టర్, కంటి వెలుగు, వైఎస్ఆర్ విలేజ్ హెల్త్ క్లినిక్స్ తదితరాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వైద్య సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్ళి ఆ కుటుంబంలోని సభ్యుల ఆరోగ్య స్థితిగతులను సంపూర్ణంగా తెలుసుకొని ప్రతి ఒక్కరి హెల్త్ ఐడికి క్రియేట్ చేయడానికి ఎన్‌సిడి-సిడి సర్వే జరుగుతుందన్నారు. ఈ సర్వే వారం రోజుల్లోపు 80 శాతం పూర్తి చేయాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సర్వేను నియోజకవర్గ స్థాయిలో పర్యవేక్షించడానికి నోడల్ ఆఫీసర్లను నియమించాలని ఇన్‌ఛార్జీ డిఎంహెచ్ఓ డాక్టర్ రాజశేఖరొరెడ్డిను కలెక్టర్ ఆదేశించారు. అలాగే సుస్థిరాభి వృద్ధి లక్ష్యాల సాధ నలో భాగంగా కౌమార దశ బాలికలకు, గర్భవతులు, బాలింతల్లో అనిమీయా నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. టిబీ ఎలిమి నేషన్ కార్యక్రమంలో భాగంగా క్షయవ్యాధి గ్రస్తులను సకాలంలో గుర్తించి వ్యాధి నిర్మూలనకు చర్యలు తీసుకోవాల న్నారు. ఈ సమావేశంలో ఇన్‌ఛార్జీ డిఎంహెచ్ఓ డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి, డిఐఓ డాక్టర్ రవిరాజు, డిపిఎంఓ డాక్టర్ శ్రీనివాసరావు, ఆర్‌బిఎస్‌కె డాక్టర్ సుదర్శన్, ఎంసిహెచ్ డాక్టర్ శిరీష, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ శ్రీనివాసులు, ఎపిడిమాలజిస్ట్ శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.


వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్

# టిడిపిలో... టిక్కెట్ల గోల!

## -ఎమ్మెల్యే అభ్యర్థులు ఖరారయ్యే వరకు అందరికీ సందిగ్ధమే!!



**ప్రభాతవార్త-తిరుపతి:**
రాజకీయాల్లో సుదీర్ఘ అనుభవం ఉన్న... వ్యూహాత్మకంగా వ్యవహరించి ప్రత్యర్థులకు చమటలుపట్టించేలా రాజకీయ చతురత కలిగిన టిడిపి అధినేత... మాజీ సిఎం చంద్రబాబునాయుడు తీరుతో ఆ పార్టీలో టిక్కెట్ల గోల మొదలైంది. మొన్నటివరకు తన సొంత జిల్లాలో సీనియర్లకు పార్టీ బాధ్యతలు అప్పగించి,,,ఆయా నియోజకవర్గ ప్రాంతాల్లో ఎవరికో ఒకరికి ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించి వారే రానున్న ఎన్నికల్లో అభ్యర్థులని చెబుతూ వచ్చిన అధినేత,యువనేత ఎన్నికలుదగ్గరపడుతుండటంతో పూర్తిగా అందుకు భిన్నంగా వ్యవహారం తయారైందనే వాదనలు వినిపిస్తున్నారు. ఓ వైపు అధికార వైసిపి 2024 ఎన్నికల్లో గెలుపు టార్గెట్‌గా చేసుకుని అన్ని స్థానాల్లో అభ్యర్థులుగా మళ్ళీ దాదాపు సిట్టింగ్‌లకే టిక్కెట్లు ఇవ్వాలని భావిస్తున్న తరుణంలో టిడిపిలో అందుకు భిన్నంగా ఇన్‌ఛార్జిలను కూడా పక్కనపెట్టి అక్కడ కొత్తవారిని దించే యోచనలో చంద్రబాబు ఉన్నారనేది స్పష్టమవుతోంది. ఇందుకు తాజాగా పూతలపట్టు నియోజకవర్గంలో ఇన్‌ఛార్జి బాధ్యతలను ఆ ప్రాంతానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ మురళికి అప్పగించడంతోబాటు 2024 ఎన్నికల్లో ఆ స్థానం నుంచి పోటీచేసేదిశగా కూడా నిర్ణయం తీసుకున్నారు. ఇప్పుడు ఆ నియోజకవర్గంలో బలమైన నాయకులు లేకపోవడంతో ఏకంగా ఓ జర్నలిస్ట్‌కు ముందుగానే టిక్కెట్ ఖరారుచేయడంపై పార్టీలో కొందరు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. మొన్నటివరకు తనకంటే తనకే పూతలపట్టు టిక్కెట్ అంటూ ప్రచారం చేసుకొంటూ వచ్చిన నాయకుల గొంతులో వెలక్కాయ పడినట్లయింది. అయితే స్థానిక ప్రజల అభిప్రాయాలతోబాటు పార్టీలో నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలను తీసుకుని టిక్కెట్లు ఖరారుచేస్తానని ఇప్పటికే మహానాడు వేదికగా చంద్రబాబు మొహమాటంలేకుండా వెల్లడించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో గెలుపే లక్ష్యంగా భావిస్తున్న చంద్రబాబు తన సొంత ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఇప్పటికే పలమనేరులో మాజీమంత్రి అమరనాథరెడ్డి, చిత్తూరులో మాజీ ఎమ్మెల్యే ఏఎస్ మనోహర్, మదనపల్లిలో దొమ్మలపాటి రమేష్,కుప్పం నుంచి చంద్రబాబు పోటీచేస్తారనేది పార్టీ వర్గాల్లో స్పష్టత వచ్చేసింది. కాగా ఇంకా ఉమ్మడి చిత్తూరుజిల్లాలో బలమైన సిట్టింగ్ ఎమ్మెల్యేలున్న పుంగనూరు, జిడి నెల్లూరు, పీలేరు, తంబళ్ళపల్లి, చంద్రగిరి, తిరుపతి, శ్రీకాళహస్తి, నగరి, సత్యవేడు నియోజకవర్గాల్లో పార్టీకి ఇన్‌ఛార్జిలుగా మాజీ ఎమ్మెల్యేలు, వారి కుటుంబ సభ్యులే బాధ్యతలు నిర్వహిస్తున్నారు. వీరిలో సగంమంది ఇన్‌ఛార్జిల పనితీరు కూడా సరిగాలేదనేది కార్యకర్తల వాదన. ఈ నేపథ్యంలో ఈ ఏడాది జనవరి,ఫిబ్రవరినెలలో యువనేత ,మాజీ ఎమ్మెల్సీ నారాలోకేష్ యువగళం పాదయాత్రలో కూడా దాదాపు కొందరిని అభ్యర్థులుగా పేర్లుప్రకటించి ప్రజలకు పరిచయం చేసిన సందర్భాలు లేకపోలేదు. అయితే చంద్రబాబు తీరుతో ఇంకా ఎవరికి టిక్కెట్లు లభిస్తాయో, ఎవరికి మొండి చేయి దక్కుతుందోనని బెంగ పట్టు కుంది. ప్రజలతో మమేకమై,ప్రజాసమస్యలపై పోరాటం చేస్తున్న నాయకులకే టిక్కెట్లు ఖరారుచేస్తానని బాబు నోట వెలువడింది. ఈ సమయంలో ఎన్నికలకు మరో తొమ్మిదినెలలు గడువు ఉండగానే పార్టీ నేతల్లో టిక్కెట్ల టెన్షన్ నెలకొంది. తిరుపతిలో దాదాపు సుగుణమ్మకే టిక్కెట్ ఖరారుచేసేశారనే సమాచారం ఉంది. అలాగే శ్రీకాళహస్తి నియోజకవర్గంలో తాజాగా బొజ్జల సుధీర్‌రెడ్డి, ఎస్‌సివి నాయుడు, నగరిలో గాలి భానుప్రకాష్, జిడి నెల్లూరు నుంచి డాక్టర్ సప్తగిరి ప్రసాద్, మాజీ ఎంపిపి రాజేంద్రన్, పుంగనూరులో చల్లా రామచంద్రారెడ్డి పేరు, చంద్రగిరి నియోజకవర్గంలో ఇన్‌ఛార్జి పులివర్తినానికి టిక్కెట్ ఖరారని ఇప్పటికే ప్రజలతో మమేకమవుతూ ప్రచారం కూడా ప్రారంభించేశారు. అయితే చివరిక్షణంలో వీరందరికీ టిక్కెట్లు ఖరారవుతాయనే నమ్మకం లేకపోతోంది. మరీ చంద్రబాబు తీసుకునే నిర్ణయాలు మళ్ళీ 2024 ఎన్నికల్లో అధికారం చేపట్టే దిశగా ఉంటాయా?అనే సందిగ్ధత ఆ పార్టీ సీనియర్ నాయకుల్లోనే నెలకొనడం కొసమెరుపు.

# ప్రతిపక్షనేత ఇంటి నిర్మాణంపై... ప్రభుత్వం శీతకన్ను

**- కుప్పంలో ముందుకు సాగని చంద్రబాబు సొంతింటి నిర్మాణం**
**- అనుమతుల మంజూరుకు ఆర్నెల్లుగా ఎదురుచూపు**
**- ఇదివరకే అధికారులకు లీగల్ నోటీసులు పంపిన చంద్రబాబు కార్యదర్శి**


కంటైనర్‌లో ఉన్న ఇంటినిర్మాణ సామగ్రి-ఇంటి నిర్మాణ స్థల ప్రాంతం

కుప్పం, జూన్ 9 ప్రభాతవార్త : ఆయన 14 ఏళ్లపాటు రాష్ట్రానికి సిఎంగా పనిచేసిన వ్యక్తి. తాను 35 ఏళ్లుగా ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంలో ప్రజలు, సొంత పార్టీ కార్యకర్తలు, అభిమానుల కోరిక మేరకు కుప్పంలో సొంత ఇల్లు నిర్మించుకోవాలని నిర్ణయించుకున్నారు.. ఇందుకు రెండు ఎకరాల స్థలం కొనుగోలు చేశారు. ఇంటి నిర్మాణంకు తొలుత ప్రహరీగోడ నిర్మించారు.. అవసరమైన గృహ నిర్మాణ సామగ్రి అంతా కంటైనర్లలో నెలల తరబడి ఉన్నాయి. ఇంటి నిర్మాణం కోసం గతంలో తాను ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అమలులో తెచ్చిన పలమనేరు,కుప్పం, మదనపల్లి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (పికెఎం ఉడా)కు దరఖాస్తు చేసుకున్నారు. అయితే అదే అథారిటీ అధికారులు నేడు ఇంటి నిర్మాణానికి అనుమతుల మంజూరులో జాప్యం చేస్తున్నారని తెదేపా నేతలు ఆరోపిస్తున్నారు. పికెఎం ఉడాకు జీవం పోసిన మాజీ ముఖ్యమంత్రి ఇంటి నిర్మాణంకే అనుమతుల మంజూరులో కొర్రీలు వేస్తున్నారని దేశం శ్రేణులు పెదవి విరుస్తున్నారు. మాజీ ముఖ్యమ ంత్రి, ప్రతిపక్ష నేత నారా చంద్రబాబు నాయుడు కుప్పంలో తన సొంత ఇంటిని నిర్మించాలని నిర్ణయించిన విషయం విదితమే. ఇందుకోసం కుప్పం - పలమనేరు జాతీయ రహదారికి సమీపంలో శాంతిపురం మండలం కడపల్లి పంచాయతీ కదిరి ఓబనపల్లి వద్ద సుమారు 2 ఎకరాల స్థలంను గతేడాది కొనుగోలు చేసి స్థలం రిజిస్ట్రేషన్ చేయించారు. గతేడాదే ఇంటి నిర్మాణ పనుల్లో భాగంగా ప్రహరీగోడ నిర్మాణం పనులు మొదలు పెట్టారు. అయితే ఇంటి నిర్మాణంకు అవసరమైన అనుమతుల కోసం పికెఎం ఉడా అధికారులకు చంద్రబాబు కార్యదర్శి మనోహర్ తగిన పత్రాలతో దరఖాస్తు చేసుకున్నారు. అయితే గతేడాది నవంబర్‌లో ఈ ఇంటి నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకుంటే సుమారు ఆర్నెల్లు గడుస్తున్నా ఇంతవరకు పికెఎం ఉడా అధికారులు అనుమతులు మంజూరు చేయలేదని సమాచారం. ఇప్పటికే గృహ నిర్మాణంకు సంబంధించిన సామగ్రిని కంటైనర్లలో ఇంటి నిర్మాణ స్థలం వద్ద ఉంచారు. కంటైనర్లలో దాదాపు ఆరు నెలలుగా సామగ్రి అలాగే పడి ఉంది. గృహ నిర్మాణంకు సంబంధించి తగు పత్రాలను పికెఎం ఉడా అధికారులకు అందించినా వారు అనుమతులు మంజూరు చేయకపోవడంతో చంద్రబాబు కార్యదర్శి అధికారులకు న్యాయవాదుల ద్వారా లీగల్ నోటీసులు సైతం పంపినట్లు సమాచారం. కుప్పంలో ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు సొంత ఇంటి నిర్మాణం కోసం అధికార యంత్రాంగం కావాలనే తాత్సారం చేస్తున్నారని తెదేపా శ్రేణులు ఆరోపిస్తున్నారు. అనుమతులను మంజూరు చేసి ఉంటే ఈఏడాది మార్చి నెలలోపే గృహ నిర్మాణం పూర్తయి ఉండేదని పేర్కొంటున్నారు. కుప్పంలో తనతండ్రి చంద్రబాబునాయుడు ఇల్లు కడతానంటే ఆర్నెల్లుగా అనుమతులు మంజూరు చేయలేదని తాజాగా తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ కడపలో ప్రస్తావించారు. ఈ వ్యవహారంపై పికెఎం ఉడా అధికారులు ఎలా స్పందిస్తా_రో వేచి చూడాల్సి ఉంది.

# మండలి సమావేశం జరగదు... అది అంతే

**- సమావేశం జరగదని అందరికీ తెలిసిన చిదంబర రహస్యం- సమావేశానికి తేదీ ఖారారు చేసిన ఇ.ఓకి, ఇబ్బందికరమైన విరేచనాలు - జవాబుదారి తనం లేని అధికారులపై సభ్యులు 'గుర్రు'**




శ్రీకాళహస్తి,జూన్ 9 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయంలో అధికారులు, సిబ్బంది జవాబుదారి తనం లేకుండా వ్యవహరిస్తున్నా తీరుపై సభ్యులు శుక్రవారం భగ్గుమన్నారు. శుక్రవారం మూడు నెలల తరువాత ధర్మకర్తల మండలి సమావేశ ఏర్పాటు చేసినట్లు అధికారులు సమాచారం అందించారు. ఈ మేరకు సభ్యులు తమ సమస్యలపై అధికారుల దుమ్ముదులపాలని సిద్ధమయ్యారు. అయితే సభ్యులు వచ్చిన ద్విచక్ర వాహనాలను కూడా 4వ గేటు ద్వారా లోపలకు రానివ్వలేదు. దాంతో సభ్యులు చిర్రెత్తి, ఆ కోపం ఛైర్మెన్ మీద చూపారు. ఇక్కడ సభ్యులంటే గౌరవం లేదని గుర్తింపు లేదని శివమెత్తారు.

**ఇఓ లేకుంటే ఇక అధికారులే లేరా?**

శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి అంటే అధికారులు,సిబ్బందికి లెక్కలేని తనం చోటు చేసుకుంది. సమావేశంకు వచ్చిన ఇఓకు విరేచనాలతో అస్వస్తత చోటు చేసుకున్నపుడు ఆయన ఎవరినో ఒకరికి బాధ్యతలు అప్పగించి సమావేశానికి హాజరు అయి జరిపించమని చెప్పవచ్చు. ఇఓ లేకుంటే ఇక అధికారులే లేదా? అని సభ్యులు ఛైర్మెన్‌ను నిలదీసారు. ఇఓ లేనపుడు అనధికారికంగా రాజ్యాంగేతర శక్తిగా పని చేస్తున్న సూపర్‌ఇఓను పిలిపించండని ఓ మహిళా సభ్యురాలు ఛైర్మెన్‌ను మొఖం మీద నిలదీయటం ఆశ్చర్యపరచింది.సమావేశం ఏర్పాటు చేసినపుడు బాధ్యతగా జరిపించాల్సిన ఛైర్మెన్‌కు కూడా అవగాహన లేనట్లుంది. ఇఓకు అస్వస్థత చేసినపుడు ఎవరికో ఒకరికి బాధ్యత అప్పగించాలి. ఇఓ ఉన్నా సమావేశంలో చేసేది ఏమి లేదు. ఛైర్మెన్ అధ్యక్షతన సమావేశం జరిగినపుడు ఏదైనా సందేహాలుంటే సమాధానంను ఇఓ ద్వారా సిబ్బంది చెబుతారు. ఇక ఛైర్మెన్ అయినా సమావేశం హాలులో కూర్చొని సభ్యులతో సమావేశం వాయిదా వేసినట్లు చెప్పాలి. కానీ అవగాహనా రాహిత్యమో ఏమో కాని అలా కూడా జరగలేదు.ఓ దశలో మహిళా సభ్యురాలు ఏడు నెలలే కదా అని వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. అసలు కారణం ఇ.ఓ విరేచనాలు కాదని, స్థానిక ఎమ్మెల్యే అందుబాటులో లేకపోవడంతోనే వాయిదా వేశారని ఆలయాధికారుల్లో గుసగుసలు వినిపించాయి.

# సిలికా, ఇసుక... మాఫియాను అరికట్టాలి

**- సిపిఐ జిల్లా కార్యదర్శి మురళి**

గూడూరు, జూన్ 9 ప్రభాతవార్త : గూడూరు నియోజకవర్గంలో సిలికా, ఇసుక మాఫియాను అరికట్టాలని సిపిఐ జిల్లా కార్యదర్శి మురళీ డిమాండ్ చేశారు. శుక్రవారం గూడూరు పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో నిర్వహించిన నియోజకవర్గ సమితి సమావేశానికి జిల్లా కార్యదర్శి హాజరయ్యారు. ఈ సందర్భంగా సిపిఐ నియోజకవర్గ స్థాయి ముఖ్యులతో చర్చించారు. నిత్యం ప్రజలతో మమేకమై స్థానిక సమస్యల పట్ల పోరాడాలని పిలుపునిచ్చారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గూడూరు నియోజకవర్గ పరిధిలో విచ్చలవిడిగా సిలికా తవ్వకాలు, అనుమతులు లేకున్నా అక్రమ సిలికా, ఇసుక రవాణ నిత్యకృత్యాలుగా మారాయన్నారు. అధికారులు మాత్రం చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారని తమ దృష్టికి వచ్చిందన్నారు. జగనన్న ఇళ్ల లబ్ధిదారులకు ఇసుక లభించక అల్లాడుతుంటే మాఫియాగా మారి ఇసుక, సిలికా మాఫియాగా మారి పక్క రాష్ట్రాలకు తరలించడం అన్యాయమన్నారు. వెంటనే సిలికా, ఇసుక మాఫియాపై ఉక్కుపాదం మోపాలని డిమాండ్ చేశారు. జగనన్న ఇళ్లకు ఐదు లక్షల రూపాయలు కేటాయించాలన్నారు. భూ హక్కుదారులకు ఇబ్బంది లేకుండా సర్వే నిర్వహించాలని కోరారు. గూడూరు పట్టణంలో నిబంధనలకు వ్యతిరేకంగా చేపడుతున్న అండర్ గ్రౌండ్ గ్యాస్ పైప్‌లైన్ పనులతో తవ్విన గుంట స్థానంలో నూతన రోడ్లు నిర్మించాలని డిమాండ్ చేశారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో వైసిపి అరాచకాలకు హద్దే లేకుండా పోయిందన్నారు. పాలకులు దళితులు, మైనారిటీలను లక్ష్యంగా దాడులు చేయిస్తున్నారని విమర్శించారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరల పెంపు, పన్నుల పెంపుతో పేద, మధ్యతరగతి ప్రజలు అల్లాడిపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సిహెచ్ ప్రభాకర్ మాట్లాడుతూ డివిజన్ పరిధిలో ఉన్న ప్రభుత్వ భూములను పేదకు పంచాలని డిమాండ్ చేశారు. ఈ నెల 25వ తేదీన సూళ్లూరుపేటలో నిర్వహించనున్న గూడూరు, సత్యవేడు, సూళ్లూరుపేటల శాఖ కార్యదర్శుల సమావేశానికి నియోజకవర్గ పరిధిలోని సభ్యులందరూ హాజరు కావాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఐ గూడూరు నియోజకవర్గ కార్యదర్శి జి.శశికుమార్, చిల్లకూరు మండల కార్యదర్శి జి.రమేష్, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి ఎంబేటి చంద్రయ్య, ఇన్సాఫ్ రాష్ట్ర ఉప కార్యదర్శి షేక్ జమాలుల్లా, నియోజకవర్గ సమితి సభ్యులు సీతా భాస్కర్, రఘురామయ్య, మస్తానయ్య, యాకోబు, శ్రీనివాసమూర్తి, హేమంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అసాంఘిక కార్యక్రమాలల్లో పాల్గొన్నవారిపై కఠిన చర్యలు : ఎస్పీ



తిరుపతి క్రైం, జూన్ 9 ప్రభాతవార్త : ప్రత్యక్షంగానో, పరోక్షంగానో గొడవల్లోగాని, అల్లర్లలో గానీ, అసాంఘిక కార్యక్రమాలలో గాని ఎవరు పాల్గొనకూడదని అట్టి వారిపై కఠన చర్యలు తప్పవని జిల్లా ఎస్పి పరమేశ్వర రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం తిరుపతి జిల్లా ఎస్పి పి. పరమేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు ఎల్‌అండ్‌ఓ కులశేఖర్ ఆధ్వర్యంలో తిరుపతి, చంద్రగిరి సబ్ డివిజన్‌ల డిఎస్పిలు సురేంద్ర రెడ్డి యశ్వంత్ సబ్ డివిజన్ సిబ్బంది అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపారు. శుక్రవారం బహిరంగ ప్రదేశాలలో మద్యపానం సేవించి అల్లరి సృష్టించే వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకున్నారు. ప్రత్యేక పోలీసు బృందాలుగా ఏర్పడి ఏకకాలంలో విస్తృతంగా దాడులు చేశారు. పట్టుబడిన వారికి కౌన్సిలింగ్ ఇవ్వడంతో పాటు తీవ్రమైన ఘటనలపై కేసు నమోదు చేశారు. ముఖ్యంగా రౌడీ షీటర్లు, అల్లరి మూకలు అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని చట్టం కఠినంగా ఉందని, సత్ప్రవర్తనతో మెలగకపోతే చర్యలు తీవ్రంగా అమలవుతుందనీ, మంచి నడవడిక సాధా అభిప్రాయం సమాజంలో కలిగేటట్లు చూసుకోవాలని, అలా కలిగినప్పుడే సానుకూల స్పందన వస్తుందని, అలా కాదని చట్టాన్ని చేతులో తీసుకుంటే, కఠిన చర్యలు తప్పవని, ఏవైనా అలజడి సృష్టించాలనే ఆలోచన వుంటే మానుకావాలి. ముఖ్యంగా నేరం చేయాలనే ఉద్దేశాన్ని మానుకోవాలి, పట్టు పడిన వారికి ఎటువంటి మినహాయింపు ఉండదు. అవాంచనీయ సంఘటనలకు, అసాంఘీక కార్యాకలాపాలకు పాల్పడటం వల్ల నిజ జీవితంలో దుర్భరమైన పరిస్థితులను ఎదుర్కోవలసి వస్తుంది. దీని వలన మీ కుటుంబంతో పాటు అభం - శుభం తెలియని మీ పిల్లల భవిష్యత్తు కూడా ప్రమాదంలో పడే అవకాశం ఎక్కువగా ఉంటుంది. కావున అందరు క్రమశిక్షణతో మెలగి మీ కుటుంబ సభ్యులకు సంతోషాన్ని ఇవ్వడమే కాకుండా మంచి పేరుతో సమాజంలో మీరు కూడా ఒక పౌరుడిగా ఉన్నట్లు మెలగి ప్రశాంతమైన వాతావరణంలో రౌడీ షీటర్లకు, అల్లరి మూకలకు పోలీసు వారి హెచ్చరింకలు జారీ చేశారు.

# బ్రహ్మాండ నాయకికి... బ్రహ్మాండంగా సుళ్లు ఉత్సవం

**- భక్తుల భక్తావేశంతో క్రిక్కిరిసిన శ్రీచెంగాళమ్మ ఆలయం**
**-అంగరంగ వైభవంగా సుడిమాను ప్రతిష్ఠ - పగడాల చీరలో అమ్మణ్ణి దర్శనం**


పగడాల చీరల అలంకారంలో శ్రీచెంగాళమ్మ

సూళ్లూరుపేట, జూన్ 9 ప్రభాతవార్త : సూళ్లూరుపేటలో శ్రీచెంగాళమ్మ తిరునాళ్లలో ప్రధాన ఘట్టమైన సుళ్ల ఉత్సవ కార్యక్రమానికి శుక్రవారం సాయంత్రం శ్రీకారం చుట్టారు. గొల్లలమొలువు గ్రామం నుంచి సాంప్రదాయబద్ధంగా వస్తున్న పుట్టింటి సారె, మన్నారు పోలూరు గ్రామం నుంచి తీసుకొచ్చిన గంగపెట్టె, పోతురాజు సాంగ్యాలతో సుడిమాను ఉత్సవం కన్నుల పండువగా జరిగింది. గొల్లల వీరతాళ్లు, పంబలోళ్ల మద్దెల జోరు, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కేరళ వాయిద్యాలు, తప్పెట్లు తాళాలతో ఆలయ ప్రాంగణం మొత్తం మార్మోగిపోయింది. ఒకపక్క చిందులు, మరోపక్క అమ్మణ్ణి పూనిన భక్తుల కిలారింపులతో ఆలయ ప్రాంగణం దద్దరిల్లిపోయింది. అమ్మా శరణు.. మహాతల్లీ కాపాడమ్మా.. అందరినీ చల్లగా చూడమ్మా అంటూ భక్తుల నినాదాలు మిన్నంటాయి. సాంప్రదాయబద్ధంగా నిర్వహిస్తున్న సుళ్ళ ఉత్సవం పద్ధతి ప్రకారం సుడిమాను తిప్పిన అనంతరం ఒక్కొక్క పర్యాయం రోలు, రోకలి, వడిబాల సాంగ్యం, మేకపోతు, పెద్దపూలమాల, మనిషి బొమ్మను పాలవల్లికి కట్టి రాట్నానికి బిగించి సుడిమానును నాలుగు వైపులా తిప్పుతూ సుడిమాను కార్యక్రమాన్ని భక్తిభావంతో జరిపారు. ఈ సుళ్ల ఉత్సవమే ప్రస్తుతం ఉన్న సూళ్లూరుపేటకు నామకరణం చేసేందుకు కారణమైందని చెప్తుంటారు. ఇందుకు సార్థకత చేకూరుతూ కాళంగినది సుళ్లలో దొరికిన అమ్మణ్ణి విగ్రహం ప్రతిష్ఠించడంతో ఆ ప్రాంతం సూళ్లూరుగా, వ్యాపార కూడలిగా ఉన్న ప్రాంతం పేటగా రూపాంతరం చెంది సూళ్లూరుపేటగా ప్రస్తుతం నానుడిలోకి వచ్చింది. ఇదే సూళ్లూరుపేటకు సుడిమాను ఉత్సవం ఎంతో ప్రత్యేకతతో చాటిచెపుతుంది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, ఛైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, చెంగాళమ్మ ట్రస్టుబోర్డు మాజీ ఛైర్మన్ వేనాటి రామచంద్రారెడ్డి, ట్రస్టుబోర్డు సభ్యులు, ఎంపిపి అల్లూరు అనిల్‌కుమార్‌రెడ్డి, కళత్తూరు శేఖర్‌రెడ్డి, జెట్టి వేణుయాదవ్, వైస్ ఛైర్‌పర్సన్ చిన్ని సత్యనారాయణ, గోగుల తిరుపాల్ తదితరులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేటలో జరుగుతున్న శ్రీచెంగాళమ్మ తిరునాళ్లలో భాగంగా శుక్రవారం సుడిమాను ప్రతిష్ఠ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య అంగరంగ వైభవంగా అమ్మణ్ణి ఎదురుగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, ఆలయ ఛైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డిల సమక్షంలో కార్య నిర్వహణ అధికారి ఆళ్ల శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణలో సుడిమాను ప్రతిష్ఠ కార్యక్రమం భక్తుల కోలాహలం మధ్య జరిగింది. అనంతరం అమ్మణ్ణి భక్తులకు ప్రత్యేకంగా అలంకరించిన పగడాల చీరలో దర్శనమిచ్చింది. ఈ కార్యక్రమంలో ట్రస్టుబోర్డు సభ్యులు పాల్గొన్నారు.


సుళ్ల ఉత్సవం జరుగుతున్న దృశ్యం




## విజయసాయిరెడ్డిని కలసిన వైకాపా బిసిసెల్‌నేత సుబ్రమణ్యం

శాంతిపురం, జూన్ 9 ప్రభాతవార్త



వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి విజయసాయిరెడ్డిని శుక్రవారం చిత్తూరు జిల్లా వైకాపా బిసి సెల్ అధ్యక్షుడు సుబ్రమణ్యం కలిశారు. విజయవాడ తాడేపల్లి కార్యాలయంలో జరిగిన బిసిల సమావేశంకు విజయసాయిరెడ్డి హాజరయ్యారు. ఈసందర్భంగా చిత్తూరు జిల్లాలో ఉన్న బిసిల స్థితిగతుల గురించి వివరించినట్లు సుబ్రమణ్యం తెలిపారు. బిసిలకు అన్ని విధాలా అండగా ఉంటామని విజయసాయిరెడ్డి పేర్కొన్నట్లు తెలిపారు.

## వృక్షాలను నరికిన రెవెన్యూ సిబ్బందిని అడ్డుకున్న గ్రామస్తులు

గంగవరం, జూన్ 9 ప్రభాతవార్త:



ప్రజలు వారి పొలాలలోని వృక్షాలను నరికి వేయాలంటే పలు శాఖలలో అనుమతుల కోసం నెలలు తరబడి కార్యాలయాల చుట్టు తీరిగినా పలు నిభందనలు అడ్డువస్తాయి.అయితే అధికార,ఆర్థిక బలం ఉంటే ఆ అధికారులే ముందుండి వృక్షాలను నరివేస్తారనడానికి మండంలోని మామడుగు పంచాయతీలో శుక్రవారం జరిగిన సంఘటన ఇందుకు నిదర్శనం. బాధితుల కథనం మేరకు మామడుగు పంచాయితీలోని కొటగురువేపల్లెకు చెందిన మామడుగు వైకాపా ఎంపిటిసి సుమిత్రమ్మ భర్త రత్నంరెడ్డిపై సుమారు 100 సంవత్సరాల పురాతన చింత చెట్టుకు 2సిపట్ట ఉంది. ఈ నేపథ్యంలో శుక్రవారం మండల రెవెన్యూ విఆర్ఓ యశోద రెవెన్యూ సిబ్బందితో కలసి కులీల,యంత్రాల సహాయంతో ఆ వృక్షాన్ని కూల్చుటానికి ప్రయత్నించగా విషయం తెలుసుకున్న ఎంపిటిసి సుమిత్రమ్మ,రత్నంరెడ్డి దంపతులు, గ్రామస్తులు వారిని అడ్డుకున్నారు.వృక్షాన్ని తొలగించేందుకు అనుమతులు ఏవరిచ్చారని ప్రశ్నించగా విఆర్ఓ తాము రెవెన్యూ అధికారులమని మాకు అనుమతులతో అవసరంలేదని నిర్లక్ష్య సమాదానం ఇవ్వడంతో గ్రామస్తులకు రెవెన్యూ అధికారులకు మధ్య వాగ్వదం చోటుచేసుకుంది.సమాచారం తెలుసుకున్న తహసీల్దార్ అమరనాథ్,పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని గ్రామస్తులతో మాట్లాడుతూ గతంలో ఉన్న దారిని తొలగించిన వారిపై తహసీల్దార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. చంగలరాయులురెడ్డి అనే వ్యక్తి స్పందన ఫిర్యాదు మేరకు రోడ్డుకు ఈ వృక్షం అడ్డుగా ఉండడంతో తొలగించే ప్రయత్నం చేశామని తెలిపారు.అయితే సుమారు 15 అడుగులు ఉన్న రోడ్డు ద్వారానే ప్రభుత్వం నూతనంగా నిర్మించిన కాలనీ,పంటపొలాలకు వెళుతున్న రైతులకు రాని సమస్య ఓ వ్యక్తికి వస్తే మాత్రం అధికారులే యంత్రాల సహాయంతో వృక్షాన్ని తొలగించే ప్రయత్నం చేయడం సరికాదన్నారు.సుమారు 100 ఏళ్లనాటి వృక్షాన్ని రెవెన్యూ అధికారులు తొలగించే ప్రయత్నం చేయడంతో మండలంలో రెవెన్యూ అధికారులు పలువిమర్శల పాలుకాకతప్పలేదు.

## ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవాలయానికి మహర్ధశ

నింద్ర,జూన్ 9 ప్రభాతవార్త :



మండల కేంద్రమైన నింద్రలో శిధిలావస్థలో ఉన్న ప్రసన్న వేంకటేశ్వస్వామి దేవాలయంను పునరుద్ధరించాలని నింద్ర గ్రామ ప్రజలు నగరి నియోజకవర్గ ఎమ్మెల్యే,రాష్ట్ర పర్యాటకశాఖామంత్రివర్యులు ఆర్‌కె రోజాకి విన్నవించగా సదరు వినతిని స్వీకరించిన మంత్రివర్యులు వెంటనే దేవాలయానికి సంబంధించిన భూ సమస్యలను వెంటనే రెవిన్యూ అధికారులతో మాట్లాడి వాటిని పరిష్కరించినారు. కొందరు గుడి నిర్మాణ విషయంలో సమస్యలు సృష్టించిన గ్రామ ప్రజల వినతినే దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రివర్యులు ఆర్‌కె రోజా, టిటిడి చేర్మన్ వైవి సుబ్బారెడ్డితో మాట్లాడి శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవాలయానికి కావలసిన రు.1.75కోట్లు రుపాయిలు మంజూరు చేయించినారు. ఈవిషయంగా శుక్రవారం టిటిడి ఇంజనీరింగ్ అధికారులు శిధిలావస్థలో వున్న ఆలయాన్ని సందర్శించి త్వరలో గుడికి భూమి పూజ చేసి పనులు ప్రారంబిస్తామని అధికారులు తెలిపారు. ఈకార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వసంతబాబురెడ్డి, యంపిపి దీపజలందర్‌రాజు, నాయకులు మేరీజయరామ్, శ్యామ్‌లాల్, సుబ్రమణ్యంయాదవ్, శివలింగం ఆచ్చారి,కుప్పరాజు,మరియు గ్రామప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్య

తిరుచానూరు, జూన్ 9 ప్రభాతవార్త :

దామినేడు సమీపంలోని చెరువు కట్ట దగ్గర శుక్రవారం గుర్తు తెలియని (55) సంవత్సరాలు వయస్సు కలిగిన వ్యక్తి చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన జరిగింది. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు సంఘటన స్థలానికి చేరుకున్న తిరుచానూరు ఎస్ఐ టీవీ సుబ్బయ్య పరిశీలించి మృతిని వద్ద ఎటువంటి ఆధారాలు లేకపోవడంతో వివరాలు తెలిపిన వారు తిరుచానూరు పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఎస్వి మెడికల్ కళాశాలకు తరలించినట్లు తెలిపారు.

## వరసిద్ధుని సన్నిధిలో కర్నాటక రాష్ట్రష మంత్రి

కాణిపాకం, జూన్ 9 ప్రభాతవార్త:



కర్నాటక రాష్ట్ర మంత్రి కెహెచ్.మునియప్ప శుక్రవారం కుటుంబసమేతంగా కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయేఈఓ రవీంద్రబాబు, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. వారి వెంట టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## టి.పుత్తూరులో గడపగడపకు మహిళా పోలీస్ సర్వే

తవణంపల్లె, జూన్ 9 ప్రభాతవార్త:



రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని టి.పుత్తూరు గ్రామంలో గడపగడపకు మహిళా పోలీస్ సర్వే కార్యక్రమంను శుక్రవారం ప్రారంభించారు. ప్రతి ఇంట్లో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే దిశగా చేపట్టిన ఈసర్వేను టి.పుత్తూరు గ్రామంలో స్థానిక ఎస్సై పివి.సుధాకర్‌రెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంట్లో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను మహిళా పోలీసుల దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈకార్యక్రమంలో తవణంపల్లె ఎస్సై పివి.సుధాకర్‌రెడ్డి, పోలీసు సిబ్బంది, గ్రామ మహిళా పోలీసులు పాల్గొన్నారు.

## బయటి వ్యక్తుల ద్వారా పరీక్షలు నిర్వహిస్తే అడ్డుకుంటాం

కుప్పం, జూన్ 9 ప్రభాతవార్త :



ద్రవిడ వర్సిటీలో ఈనెల 15నుంచి డిగ్రీ ఫైనల్ ఇయర్ పరీక్షలను బయటి వ్యక్తుల ద్వారా నిర్వహిస్తే అడ్డుకుంటామని వర్సిటీ తాత్కాలిక ఉద్యోగులు స్పష్టం చేశారు. శుక్రవారం రెక్టార్ ఆచార్య అనురాధ తాత్కాలిక ఉద్యోగులతో చర్చించారు. పరీక్షల నిర్వహణకు ఉద్యోగులు సహకరించాలని కోరారు. దీనిపై తాత్కాలిక ఉద్యోగులు మాట్లాడుతూ తాము 42 రోజులుగా సమ్మె చేస్తున్నా పట్టించుకోవడం లేదని ఇప్పుడు పరీక్షలు నిర్వహిస్తాంసహకరించండిఅనిఎలా అడుగుతారని ప్రశ్నించారు. దీంతో వర్సిటీ అధికారులు వెనుతిరిగారు.

## అంగన్‌వాడీలకు బకాయి బిల్లులు చెల్లించాలి

కుప్పంరూరల్, జూన్ 9 ప్రభాతవార్త :



కుప్పం ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో అంగన్‌వాడీలకు బకాయి బిల్లులు చెల్లించాలని వర్కర్లపై వేధింపులు మానుకోవాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు వాడ గంగరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గుడుపల్లె మండలంలో అంగన్‌వాడీ వర్కర్లను ఇబ్బందులు పెడుతున్న వారిపై చర్యలు చేపట్టాలన్నారు. దీనిపై సిడిపిఓ స్పందించాలన్నారు. సమావేశంలో యూనియన్ అధ్యక్షురాలు లలిత,కస్తూరి,సరళ,భారతి,అనిత,అంబుజాక్షి,రత్తమ్మ,మునిరత్నమ్మ, లలితమ్మ తదితరులు పాల్గొన్నారు.

## గోడౌన్ల మరమ్మతులకు తక్షణం నిధులు మంజూరు

కుప్పంరూరల్, జూన్ 9 ప్రభాతవార్త :



పౌర సరఫరాల శాఖ పరిధిలో ఉన్న గోడౌన్ల మరమ్మతులకు తక్షణం నిధులు మంజూరు చేసేందుకు ఎపిసిఎస్‌సి విసి మరియు ఎండి వీరపాండ్యన్ అంగీకరించారని ఎపిసిఎస్‌సి డైరెక్టర్ మైసూరు శ్రీనివాసమూర్తి తెలిపారు. శుక్రవారం విజయవాడలో కార్పోరేషన్ డైరెక్టర్ల సమావేశం జరిగిందని ఈ సమావేశంలో ఎండి మాట్లాడుతూ కార్పోరేషన్ పరిధిలో ఎక్కడా అవినీతి జరగలేదని తెలిపారన్నారు. అనంతరం వివిధ సమస్యలపై చర్చించినట్లు తెలిపారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## 15న కాణిపాకం ఆలయ హుండీల లెక్కింపు

కాణిపాకం, జూన్ 9 ప్రభాతవార్త

కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో ఈనెల 25న ఆలయ హుండీ లెక్కింపు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ ఎ.వెంకటేశు తెలిపారు. ఉదయం 7 గంటలకు జరిగే హుండీ లెక్కింపు కార్యక్రమంలో ఆలయ అధికారులు,సిబ్బంది తప్పక పాల్గొనాలని తెలిపారు.

## గణనాధుని సేవలో శ్రీకాకుళం ఎమ్మెల్సీ

కాణిపాకం, జూన్ 9 ప్రభాతవార్త:



శ్రీకాకుళం ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి శుక్రవారం కుటుంబ సమేతంగా కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాబు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు.

## ఎంపిడిఓగా ప్రేమ్‌రాజ్‌కుమార్ బాధ్యతలు స్వీకరణ

పాలసముద్రం, జూన్ 9 ప్రభాతవార్త:



పాలసముద్రం మండల ఎంపిడిఓగా ప్రేమ్‌రాజ్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. శ్రీకాళహస్తి ఎంపిడిఓ కార్యాలయంలో ఏఓగా విధులు నిర్వహిస్తున్న ప్రేమ్‌రాజ్‌కుమార్ పదోన్నతి కలగడంతో జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డి ఆయనను పాలసముద్రం ఎంపిడిఓగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ప్రేమ్‌రాజ్‌కుమార్ శుక్రవారం ఎంపిడిఓ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇది వరకు పాలసముద్రం మండల ఎంపిడిఓగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసులు గుడిపల్లి మండల ఎంపిడిఓగా బదిలీ అయ్యారు.

## దళిత ఎమ్మెల్యేను కులం పేరుతో దూషిస్తారా! : ఎమ్మెల్యే

బంగారుపాళ్యం, జూన్ 9 ప్రభాతవార్త:



ప్రజాస్వామ్య పద్దతిలో ఎన్నికైన దళిత ఎమ్మెల్యేను కులం పేరిట అగ్రవర్ణాలకు చెందిన తెలుగుదేశం కార్యకర్తలు దూషిస్తారా! అంటూ పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు ప్రశ్నించారు. శుక్రవారం మొగిలివారిపల్లి సచివాలయంలో ఎమ్మెల్యే విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంను మొగిలివారిపల్లిలో చేయడానికి తాను వెళ్ళితే అక్కడ వున్న టిడిపి అగ్ర కులస్తులు కులం పేరుతో దూషించారన్నారు. దళితులు ఎమ్మెల్యేగా పదవులు చేపట్టి ప్రజా సేవ చేయకూడదా అంటూ ఎమ్మెల్యే ప్రశ్నించారు. జిల్లా వ్యవసాయ సలహామండలి ఛైర్మన్ రామచంద్రారెడ్డి, వైస్ ఎంపిపి శిరీష్‌రెడ్డి, సర్పంచ్ శ్రీనివాసులు, వైకాపా నాయకులు కిషోర్‌కుమార్‌రెడ్డి, మహేంద్ర, అన్ను తదితరులు పాల్గొన్నారు.

## గడప గపపకు మహిళా పోలీస్

బంగారుపాళ్యం, జూన్ 9 ప్రభాతవార్త:

రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా చేపట్టిన గడప గడపకు మహిళా పోలీస్ కార్యక్రమంను బంగారుపాళ్యంలో శుక్రవారం నిర్వహించారు. ఇన్స్‌పెక్టర్ నరసింహారెడ్డి, మాజీ సర్పంచ్ కృష్ణమూర్తి, మహిళా పోలీసులు, వాలంటీర్లు ఇంటింటికి వెళ్ళి మహిళా పోలీసుల బాధ్యతలను ప్రజలకు వివరించారు.

## బంగారుపాళ్యంలో హిరో సప్తగిరి హల్‌చల్

బంగారుపాళ్యం, జూన్ 9 ప్రభాతవార్త:



ప్రముఖ సినీ హిరో సప్తగిరి శుక్రవారం సాయంత్రం బంగారుపాళ్యంలో హల్‌చల్ చేశారు. తాను నటించిన అన్‌స్టాబుల్ శుక్రవారం విడుదల అయ్యింది. ఈ సినిమాను స్థానిక బాలాజీ థియేటర్‌లో ప్రదర్శిస్తున్నారు. తాను చదువుకొన్న బంగారుపాళ్యంకు విచ్చేసిన హిరో తన మిత్రులతో కలిసి సినిమాను తిలకించారు. ఈ కార్యక్రమంలో హిరో మిత్రులు కేశవులు, కుమార్, చిన్నా తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## టిడిపి మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

– మాజీ ఎంపి నెలవల సుబ్రహ్మణ్యం

సూళ్లూరుపేట, జూన్ 9 ప్రభాతవార్త :



తెలుగుదేశం పార్టీ రాజమండ్రిలో నిర్వహించిన మహానాడులో చంద్రబాబునాయుడు ప్రకటించిన మినీ ఎన్నికల మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని మాజీ ఎంపీ, నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జ్ నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. శుక్రవారం స్థానిక సత్యసాయి కల్యాణ మండపంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి తెలుగుదేశం పార్టీ చర్చావేదికలో ఆయన పాల్గొన్నారు. భవిష్యత్తుకు గ్యారెంటీ అనే పేరు మీద ఆయన తెలుగుదేశం పార్టీ ప్రతినిధుల నుంచి సలహాలు, సూచనలు తీసుకున్నారు. ఈ నెల 10వ తేదీ నుంచి ప్రతి కార్యకర్త, నాయకులు, బూత్ కన్వీనర్లు కలిసి పార్టీ ప్రకటించిన ఎన్నికల మినీ మేనిఫెస్టో గురించి వివరిస్తూ, ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన కోరారు. చంద్రబాబు ప్రకటించిన మేనిఫెస్టో ఎంతో ఉపయోగకరమైనదన్నారు. బిసిలకు, మహిళలకు ఇందులో అధిక ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు. అలాగే ఎన్నికల మేనిఫెస్టోలోని హామీలను నూటికి నూరు శాతం నెరవేర్చగల సత్తా చంద్రబాబుకే ఉందని నెలవల అన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి పార్లమెంటరీ పార్టీ అధ్యక్షుడు గొల్ల నరసింహయాదవ్, తిరుమూరు సుధాకర్‌రెడ్డి, ఆకుతోట రమేష్, పి.శ్రీనివాసులునాయుడు, సుధీర్‌రెడ్డి, కృష్ణయ్య, కృష్ణారెడ్డి, అశోక్, ఎజి కిషోర్, సిహెచ్ పెరుమాళ్లు, మేడా సాయి, నీలకంఠం, పెంచలయ్య, సుదర్శన్ మొదలి తదితరులు పాల్గొన్నారు.

## అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

సూళ్లూరుపేట, జూన్ 9 ప్రభాతవార్త :

సూళ్లూరుపేటలో నిర్వహిస్తున్న శ్రీచెంగాళమాత పరమేశ్వరిదేవి తిరునాళ్లలో భాగంగా రెండోరోజు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సినీ సింగర్ మోహన్ భోగరాజ్, సుమంత్‌ల పాటకచ్చేరి, తెలంగాణ ఫోక్ సింగర్ కనకవ్వ పాటకచ్చేరి, బుల్లెట్ భాస్కర్ బృందంచే హాస్యవల్లరి, పల్సర్ బైక్ ఝాన్సీ బృందంచే డాన్సులు, ఢీ ఫేం పండు మాస్టర్ డాన్సు, శైలజ వర్మ యాంకరింగ్‌తో సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా శ్రీచెంగాళమ్మ మైదానంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ స్టాల్స్, విద్యుద్దీపాలంకరణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

## అత్యుత్తమ బోధనతో రాష్ట్రస్థాయి ర్యాంకులు

గూడూరు, జూన్ 9 ప్రభాతవార్త :



గురువారం విడుదలైన ఏపీఆర్‌జేసీ 2023 పలితాలలో గూడూరు పట్టణంలోని శివాని స్టడీ సర్కిల్ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. ఏపీఆర్‌జేసీ ప్రవేశ పరీక్ష పలితాలలో శివాని స్టడీ సర్కిల్ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ర్యాంకులు సాధించారు.

## సమస్యల పరిష్కారమే ధ్యేయం : ఎమ్మెల్యే

నాయుడుపేట, జూన్ 9 ప్రభాతవార్త :



ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. శుక్రవారం నాయుడుపేట మండలం పుదూరు గ్రామంలో రెండవరోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైసీపీ నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్లారు. సమస్యలు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు.

## మసీదులు, ఈద్గాల అభివృద్ధికి కృషి

కోట, జూన్ 9 ప్రభాతవార్త :



గూడూరు నియోజకవర్గంలోని మసీదులు, ఈద్గాల అభివృద్ధికి కృషి చేస్తానని గూడూరు నియోజకవర్గం ముతవల్లిల అధ్యక్షుడు మొబిన్‌బాషా చెప్పారు. ఆయన శుక్రవారం కడివేడు మసీదులో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గూడూరు నియోజకవర్గంలోని మసీదులు, ఈద్గాల అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. మసీదుల అభివృద్ధికి అవసరమైన కార్యాచరణతో ముందుకు పోతామన్నారు. ఈ కార్యక్రమంలో ముతవల్లిల ఉపాధ్యక్షుడు షేక్ రహీంబాషా, సెక్రటరి జిలాని అహ్మద్, జాయింట్ సెక్రటరి షేక్ గఫూర్‌బాషా, కాలేషా, మౌలానా తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ వినియోగదారుల సమస్యలు పరిష్కరిస్తాం

కోట, జూన్ 9 ప్రభాతవార్త :



కోట, వాకాడు, చిట్టమూరు మండలాల్లోని విద్యుత్ వినియోగదారుల సమస్యలను పరిష్కరిస్తామని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్‌కె ఇస్మాయిల్ అహ్మద్ చెప్పారు. శుక్రవారం స్థానిక రెడ్డి భవన్‌లో నిర్వహించిన ప్రత్యేక విద్యుత్ అదాలత్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారుల సమస్యలు ఏమైనా ఉంటే రాతపూర్వకంగా తెలియజేయాలని, ఆ సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఇ సురేష్, ఎడి వరప్రసాద్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

## లారీలో దారి దోపిడి!

దొరవారిసత్రం, జూన్ 9 ప్రభాతవార్త :



చెన్నై నుంచి విజయవాడ వైపు వెళుతున్న పార్శిల్ సర్వీసు లారీ దారిదోపిడీకి గురైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. విజయవాడకు వెళుతున్న పార్శిల్ లారీని మార్గం మధ్యలో గుర్తుతెలియని వ్యక్తులు తాళాలు పగులగొట్టి అందులో ఉన్న వివిధ వస్తువులను చోరీ చేశారు. దొరవారిసత్రం సమీపంలోని నెలబల్లి వద్దకు వచ్చి చూసుకునే సరికి లారీలోని వస్తువులు అపహరణకు గురైనట్లు డ్రైవర్ గుర్తించాడు. వెంటనే డ్రైవర్ దొరవారిసత్రం పోలీసులకు సమాచారం అందించాడు. నాయుడుపేట రూరల్ సిఐ వైవీ సోమయ్య, దొరవారిసత్రం ఎస్ఐ తిరుమలరావు సంఘటన స్థలానికి చేరుకొని లారీని పరిశీలించారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## బిజేపితో టిడిపి,వైసిపి మిలాఖత్

–మాజి కేంద్ర మంత్రి డాక్టర్ చింతామోహన్

వెంకటగిరి, జూన్ 9 ప్రభాతవార్త :




బిజేపితో వైసిపి,టిడిపి పార్టీలు మిలాఖత్ అయ్యాయని మాజి కేంద్ర మంత్రి డాక్టర చింతామోహన్ తెలిపారు. వెంక టగిరిలోని పోలేరమ్మ గుడి కూడలిలలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వ్యతిరేక విధానాలకు నిరసనగా ధర్నా చేశారు. ఆయన మాట్లాడుతూ మాజి సిఎం చంద్రబాబు నాయుడు, సిఎం జగన్ మోహన్‌రెడ్డిలు అమిత్‌షాన్‌ను తరచూ కలుస్తున్నట్లు ఆరోపించారు. బిజేపి వారు ప్రజా వ్యతిరేక విదానాలు అవలంభిస్తున్న టిడిపి, వైసిపి వారు పట్టించుకోవడంలేదన్నారు. రైల్వేశాఖను ప్రయివేటు పరం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్దం అవుతున్నట్లు తెలిపారు. పెంచిన వంట గ్యాస్‌దరలను వెంటనే తగ్గించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజవర్గ ఇన్‌చార్జి పంటా శ్రీనివాసులరెడ్డి,తదితరులు పాల్గొనా న్నరు.

## వైసిపి ప్రభుత్వంలో అవినీతి తప్ప అభివృద్ధి లేదు

–టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర

వెంకటగిరి, జూన్9 ప్రభాతవార్త :




వైసిపి ప్రభుత్వంలో అవినీతి తప్ప అభివృద్ధి లేదని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర ఆరోపించారు. శుక్రవారం నాదు మాజి ఎంఎల్ఎ రామకృష్ణ నివాస గృహంలో టిడిపి నేతలతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎలాంటి అభివృద్ధి చేయక పోగ కోట్లాది రూపాయల అప్పులు చేసినట్లు ఆరోపించారు. రాష్ట్రం అవినీతి మయంగా మారినట్లు తెలిపారు. సిఎం జగన్‌మోహన్ రెడ్డి అవినీతి సంపాదనలో టాప్‌లో ఉన్నట్లు తెలిపారు. ఇసుక,మద్యం,ఎర్రచందనం వాటి ద్వార నాలుగు లక్షల కోట్ల రూపాయలు ఆర్జించినట్లు తెలిపారు.చెత్తపై పన్ను విధించిన ఏకైక సిఎం జగన్‌మోహన్‌రెడ్డేనని తెలిపారు. టిడిపి మ్యానిపెస్టోని విమర్శించే అర్హత లేదన్నారు. కాగా 2024 ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజి మంత్రి పరసారత్నం,టిడిపి జిల్లా అధ్యక్షులు నరసింహ యాదవ్, మాజి ఎంఎల్ఎ కురుగొండ్ల రామకృష్ణ, నియోజవర్గ పరిశీలకులు పెళ్ళకూరు శ్రీనివాసులురెడ్డి, మాజి ఎఎంసి ఛైర్మన్ పులికల్లు రాజేశ్వరరావు, నాయకులు గంగాదర్, చంద్రమౌళిరెడ్డి, సత్యనారాయణ, విశ్వనాదం,కేవికె ప్రసాద్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## చేనేత పరిశ్రమకు పూర్వవైభం తీసుకొస్తా

–వైసిపి జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి

వెంకటగిరి, జూన్9 ప్రభాతవార్త:



పెద్దలతో మాట్లాడి చేనేత పరిశ్రమకు పూర్వవైభం తీసు కొని వస్తానని నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఎన్‌టిఆర్ కాలనీలో భావనరుషి చేనేత క్లష్టర్‌కు మూడు కోట్ల రూపాయల విలువ కల్గిన జాకడ్ మిషన్లను పంపిణి చేశారు. ఆయన మాట్లాడుతూ గతంలో కన్న చేనేత పరిశ్రమ ఉనికి తగ్గినట్లు తెలిపారు. కరోన సమయంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్న ప్రజలు ఇబ్బంది పడకూడదని సంక్షేమ పథకాలను అందించినట్లు తెలిపారు. సమావేశంలో ఛైర్‌పర్సర్ నక్కా భానుప్రియ, కమీషనర్ వెంకట్రామయ్య, పట్టన కన్వినర్ జి డిల్లిబాబు, పద్దసాలే కార్పోరేషన్ డైరెక్టర్ నక్క వెంకటేశ్వరరావు,కౌన్సిలర్స్ జానకీరామయ్య, రాధమ్మ, చంద్రశేఖర్‌రెడ్డి, ఎంఎ నారాయణ నాయకులు లక్కమనేని కోటేశ్వరరావు పాల్గొన్నారు.

## కళ్యాణ వేంకన్నకు ఘనంగా వశంతోత్సవ వేడుకలు

నారాయణవనం, జూన్ 9 ప్రభాతవార్త :



నారాయణవనంలో ప్రసిద్ది చెందిన టిటిడి ఆలయం పద్మావతీదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరుని వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారంతో ముగిసింది. శుక్రవారం ఆలయంలో స్వామి, అమ్మవార్లకు ఘనంగా వశంతోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లను పుష్పాలతో అలంకరించిన తర్వాత భక్తులకు దర్శనం కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు నాగరాజు, ఆర్జితం ఇన్స్‌పెక్టర్ భరత్, అర్చకులు శ్రీధర్ భట్టాచార్యలు, నరసింహరాఘవ భట్టాచార్యలు, శ్రీనివాస భట్టాచార్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా ముత్యాలమ్మ కొలుపు ఉత్సవం

నారాయణవనం, జూన్ 9 ప్రభాతవార్త :

మండలంలోని బ్రాహ్మణాతాంగేల్ పంచాయతీలోని వడ్డీళ్లలో శుక్రవారం ముత్యాలమ్మ తల్లి కొలుపు ఉత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని విద్యుత్‌దీపాలంకరణ, వేపాకు తోరణాలతో అలంకరించారు. ఉదయం మహిళ భక్తులు పొంగళ్లు పెట్టుకోవడం, రంగుల ముగుళ్లతోఅలరించారు. సాయంత్రం అమ్మవారి గెరిగను గ్రామ వీధుల్లో మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఘనంగా ఊరేగించారు. అమ్మవారి పెద్ద పెద్ద విద్యుత్ కటౌట్లను ఏర్పాటు చేశారు.

## హరోం....హర

–వైభవంగా శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయ కుంభాభిషేకం

రేణిగుంట, జూన్ 8 ప్రభాతవార్త:



హరోం...హర అంటూ పాపానాయుడుపేట గ్రామం శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి నామస్మరణతో గత నాలుగు రోజులుగా మారుమోగిపోతుంది. నూతనంగా దాదాపు 80లక్షల వ్యయంతో పవిత్ర స్వర్ణముఖి నది తీరాన తిరుపతి జిల్లా ఏర్పేడు మండలం పాపానాయుడుపేట గ్రామంలో శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం ఆగమ శాస్త్రానికి అనుగుణంగా రూపుదిద్దుకుంటుంది. ఆదివారం నుంచి 16 మంది వేద పండితులు విశేష పూజలు, కలశాభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ధ్వజస్తంభ ప్రతిష్టాపన, వాహన ప్రతిష్టాపన జరిగాయి. ఆలయ స్థపతి తమిళనాడు కారైకుడి వాసి టి.శరవణన్ ఆలయాన్ని అద్భుతంగా నిర్మించారు. మద్రిమండకు చెందిన శిల్పి శ్రీమంతుల సీతాపతి ఆచారి తయారు చేశారు. దేవాలయ నిర్మాణానికి నామ మురుగప్ప, నాగా బత్తిబాబు 70 శాతం నిధులను సమకూర్చారు. ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి కుమార్తె పవిత్రరెడ్డి ముఖ్య అతిథిగా దేవాలయాన్ని సందర్శించారు. మధ్యాహ్నం మేళకళత్తూరు ఏళుమలై మొదలి అన్నదాన సేవా సంఘం ఏళుమలై జ్ఞాపకార్థం పెద్ద ఎత్తున అన్నదానం చేశారు. ప్రధాన అర్చకులు లక్ష్మినారాయణ, రాజశేఖర్‌వర్మతో కూడిన 16 మంది వేద పండితుల సమక్షంలో అన్ని పూజలు జరిగాయి. కార్యక్రమంలో అర్జునబాబు, పలువురు వైసీపీ నేతలు, పెద్దలు పాల్గొన్నారు.

## విద్యా కానుకపై హెచ్‌ఎంలకు,ఎంఈఓలకు సూచనలు

తిరుపతి కలెక్టరేట్, జూన్ 9 ప్రభాతవార్త :

జగనన్న విద్యా కానుక పై హెచ్‌ఎంలు, ఎంఈవోలు తప్పకుండా సూచనలు పాటించాలని విద్యా శాఖ అధికారి డా.వి. శేఖర్ పేర్కొన్నారు. ఈ నెల 12వ తేది జగనన్న విద్యా కానుక పంపిణీ ప్రతి పాఠశాలలో పండుగ వాతావరణంలో జరగాలన్నారు. ప్రతి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కిట్ల తయారీ, పంపిణీలో క్లాస్ టీచర్స్‌ను భాగస్వామం చేయాలని ఇతర టీచర్లు సహకరించేలా చూడాలన్నారు. ఈ నెల 12న పిల్లలందరికీ జేవికె కిట్ పంపిణీ అయ్యే విధంగా హెచ్‌ఎం, ఉపాధ్యాయులు జాగ్రత్త వహించాలన్నారు. జేవికే కిట్ పంపిణీ సమయంలో జెవికే వస్తువుల వారీగా బాల బాలికల నుంచి మాన్యువల్ అక్విటెన్స్ తీసుకోవాలన్నారు.

## ఇస్లాం మతం కాదు...దిక్సూచి : రేహాన్

శ్రీకాళహస్తి, జూన్ 9 ప్రభాతవార్త :



ఇస్లాం ఒక మతం కాదని మానవుని సన్మార్గంలో నడిపే దిక్సూచి అని హాఫీజే ఖుర్ ఆన్ రేహాన్ సాహెబ్ అన్నారు. శుక్రవారం జామియామసీజిద్‌లో ప్రత్యేక ప్రార్థనల సందర్భంగా ఆయన ముస్లింలకు దిశ దెశ నిర్దేశం చేస్తూ ఇస్లాం మతం మంచిని నేర్పుతుందన్నారు. ప్రతి ఒక ముస్లిం తన జీవిత రహస్యాన్ని తెలుసుకోవాలన్నారు. దేవుని ఆదేశాలను అమలు చేస్తూ దేవుని ఆదేశాలను అమలు చేయాలన్నారు. పరోపకారమే జీవిత పరమార్థం అని గ్రహించాలన్నారు.అంతేకాక మనవ జన్మ పరమార్థంను తెలుసుకొని బతకాలన్నారు. నేడు మనం లక్షలు కోట్లు సంపాదిస్తున్నా మన సంసారాల్లో సుఖం లేదు. సంతృప్తి లేదు. సంతోషం అసలే లేదన్నారు. కారణం మనం అల్లాహ్ ఆదేశాలను తుంగలో తొక్కుతున్నాము. అల్లాహ్ అందేంచే అన్ని సుఖాలను అనుభవిస్తూ ఆతని ధ్యానాన్ని విస్మరిస్తున్నామన్నారు. మరి మనకు సుఖసంతోషాలు ఎలా ఉంటాయని ప్రశ్నించారు. మనం అల్లాహ్ సూచనలను ఆచరించటం లేదన్నారు. అంతేకాక ఖుర్బానీ పేరుతో నమాజులను ఎగ్గొట్టరాదన్నారు.

## కోర్టుకెక్కిన దేవస్థానం ఉద్యోగులు

శ్రీకాళహస్తి, జూన్ 9 ప్రభాతవార్త :

2022లో దేవాదాయశాఖ చేపట్టిన సాధారణ బదిలీల్లో తమకు అన్యాయం జరిగిందంటూ శ్రీశైలం నుంచి శ్రీకాళహస్తీశ్వరాలయానికి బదిలీపై వచ్చిన ఉద్యోగులు పలుమార్లు దేవాదాయశాఖ అధికారులను సంప్రదించినప్పటికీ స్పందించనందుకు కోర్టును ఆశ్రయించారు. ఈమేరకు నలుగురు ఉద్యోగులు మార్చి 10న రాష్ట్ర హైకోర్టులో ఫిటిషన్ దాఖలు చేశారు. ఫిటిషన్ దాఖలు చేసిన వారిలో ఎఈ పివి.సుబ్బారెడ్డి, సీనియర్ అసిస్టెంట్లు శ్రీనివాసులురాజు, శ్రీనివాసులరెడ్డి జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులు కోర్టును ఆశ్రయించారు. వారి వాదనలు విన్న హైకోర్టు దేవాదాయశాఖకు సూచనలిస్తూవారిని శ్రీశైలంలోని భ్రమరాంబమల్లికార్జునస్వామి ఆలయానికి బదిలీ చేయాలని ఈఉత్తర్వులను వెంటనే అమలు చేయాలని రాష్ట్రదేవాదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ, శ్రీకాళహస్తి, శ్రీశైలం ఈవోలుకు ఆర్‌సి.నంబర్.సి1/13027(48)/8/2023 తేదీ 9.6.2023 ఉత్తర్వులు జారీచేశారు. దాంతో ఏడాది పాటు శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానంలో పనిచేసిన ఉద్యోగులు శ్రీశైలంకు వెళ్ళారు.

## హర్‌దిల్‌మే జగన్: హమ్ సబ్ జగన్‌కే సాత్



శ్రీకాళహస్తి,జూన్ 9 ప్రభాతవార్త :

తిరుపతి జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మెన్ షేక్ సిరాజ్‌బాషా సారధ్యంలో శ్రీకాళహస్తి పట్టణంలో విస్తృత స్థాయిలో 'హర్‌దిల్‌మే జగన్: హమ్ సబ్ జగన్‌కే సాత్' కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఆయన మక్కామసీదు ఆవరణలోనూ, కుమారస్వామి తిప్ప పరిసరాల్లో ప్రచారాన్ని నిర్వహించారు. రాష్ట్ర మైనారిటి ,వక్ఫ్‌బోర్డు చైర్మెన్ ఖాదర్‌బాషా సూచనలతో రాష్ట్ర ప్రభుత్వం జగన్మోహన్‌రెడ్డి చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను అలాగే జగన్మోహన్‌రెడ్డి, గతంలో డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో మైనారిటి ముస్లింలకు అందించిన పథకాలకు సంబంధించి వివరిస్తూ ప్రచారం చేపట్టారు. శుక్రవారం కార్యక్రమాల్లో మక్కామస్జిద్ ముతవల్లి ఇలియాస్ హుసేన్, సలహా సభ్యులు షేక్ మీర్జాన్‌సాహెబ్, షేక్ ఉస్మాన్, ఎపెద్దలు అబ్దుల్ కలాం, షేక్ ఖాదర్‌బాషా, షేక్ బషీర్, షేక్ షాను తదితరులు పాల్గొన్నారు.

## వైభవం..అమ్మవారి తిరుచ్చివాహనసేవ

శ్రీకాళహస్తి, జూన్ 9 ప్రభాతవార్త :



శ్రీకాళహస్తీశ్వరాలయంలో ప్రతి శుక్రవారం రాత్రి స్వామిఅమ్మవార్ల దీపారాధన అనంతరం అమ్మవారి ఆలయం వెలుపల ఉన్న మండపంలో ఆలయంలోవెలసిన జ్ఞానప్రసూనాంబికాదేవిని ఆలయంలోని అలంకార మండపంలో సర్వాంగ సుందరంగా అలంకరించి తిరుచ్చివాహనంపై కొలువుదీర్చి వేదమంత్రాలు, మంగళవాయిద్యాలనడుమ అమ్మవారికి ఆలయ ప్రాకారోత్సవం, తిరుచ్చి ఉత్సవం వైభవంగా నిర్వహించారు. అనంతరం ప్రత్యేకహారతులిచ్చారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, పలువురు భక్తులు పాల్గొన్నారు.

## నిబంధనలు పాటించని వాహన చోదకులు టూ టౌన్ సిఐ కౌన్సిలింగ్

గూడూరు, జూన్ 9 ప్రభాతవార్త :



వాహన చోదకులకు రోడ్డు ప్రమాదాల పట్ల అవగాహన కలిగి ఉండాలని, ఆపద సమయంలో హెల్మెట్ రక్షణగా నిలుస్తుందని, ప్రతి ఒక్కరూ విధిగా వాహనం నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని గూడూరు టూ టౌన్ సిఐ వెంకటేశ్వర రావు తెలిపారు. రెండవ పట్టణంలోని కోర్టు సెంటర్ కూడలి వద్ద ఎస్పీ ఆదేశాల మేరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. పలువాహనాలను పరిశీలించి, త్రిబుల్ రైడ్, మైనర్ల వాహనాలు నడుపుతుండగా సుమారు 20 వాహనాలను రెండవ పట్టణ పోలీస్ స్టేషన్‌కు తరలించి, వాహనదారులుకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. సురక్షితంగా గమ్యాలను చేరుకోవాలన్నారు.

## హోరుగాలి... వర్షం

నగరి, జూన్ 9 ప్రభాతవార్త:



మున్సిపల్ పరిధిలో సాయంత్రం హోరుగాలితో వర్షంకురిసింది. వర్షం తాకిడికి గాలి వేగంగా వీచడంతో పలు చోట్ల చెట్లు విరిగి పడ్డాయి. దీంతో పలు చోట్ల విద్యుత్ తీగలు తెగిపోవడంతో సుమారు మూడు గంటల పాటు విద్యుత్ అంతరాయం ఏర్పడింది. విరిగిన చెట్లను తొలగించి పరిస్థితి యథాస్థితికి తేవడంతో విద్యుత్ శాఖసిబ్బంది, మున్సిపల్ సిబ్బంది శ్రమ పడాల్సి వచ్చింది. సమస్యను సరి చేసి రాకపోకలకు సౌకర్యం కల్పించడంతో పాటు విద్యుత్ సరఫరాను అందించారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నగరి, జూన్ 9 ప్రభాతవార్త:

విద్యుత్ సబ్‌స్టేషన్ల సర్వీసులో భాగంగా శనివారం నగరి, నెత్తం కండిగ్ర, రాజీవ్‌నగర్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ట్రాన్స్‌కో ఏఈ మోహన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నివాసితులు సహకరించాలన్నారు.

## నేడు విద్యుత్ సరఫరా ఉండదు

రేణిగుంట, జూన్ 9 ప్రభాతవార్త:

శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని రేణిగుంట సబ్ డివిజన్ ఏపీఎస్‌పీడీసీఎల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రభాకర్ తెలిపారు. తూకివాకం, గాజులమండ్యం, కరకంబాడి, ఎల్లమండ్యం, గురవరాజుపల్లె విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని ప్రాంతాల్లో సబ్‌స్టేషన్లు మెయింటెనెన్స్, మరమ్మతులు, విద్యుత్ లైన్లకు అడ్డంగా పెరిగిన చెట్ల కొమ్మలను తొలగించడం కోసం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

## నేరాల పట్ల అప్రమత్తంగా ఉండండి : డీఎస్పీ

రేణిగుంట, జూన్ 9 ప్రభాతవార్త:



నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని రేణిగుంట డీఎస్పీ భవ్యకిషోర్ ప్రజలకు పిలుపునిచ్చారు. తిరుపతి ఎస్పీ పరమేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు డీఎస్పీ భవ్యకిషోర్, రూరల్ సీఐ సుబ్బరాయుడు, గాజులమండ్యం ఎస్ఐ ధర్మారెడ్డి సిబ్బందితో కలసి రూరల్ సర్కిల్‌పరిధిలోనిపలు గ్రామాల్లో శుక్రవారం విస్తృతంగా పర్యటించారు. అల్లరి మూకలు ఆగడాలు చేస్తేవెంటనే పోలీసు టోల్ ఫ్రీ నెంబరు 100కి కాల్‌చేయాలని సూచించారు. అనుక్షణం పోలీసులు ప్రజల సేవలోనే ఉంటారని తెలిపారు. శాంతిభద్రతలకు విఘాగం కలిగిస్తే క్షమించమన్నారు.

## మంచి సందేశాత్మక చిత్రం..మహిషాసురుడు

–ఆదరించి ఆశీర్వదించాలని డాక్టర్ల పిలుపు

తిరుపతి ప్రెస్‌క్లబ్,జూన్ 9 ప్రభాతవార్త:



ప్రముఖ కార్డియాలజిస్ట్ అయిన డా॥గురుప్రసాద్ నిర్మాతగా,అలాగే కథానాయకుడిగా నటించి రూపొందించిన 'మహిషాసురుడు' చిత్రం మంచి సందేశాత్మక చిత్రమని, ప్రేక్షకులు ఆదరించి ఆశీర్వదించాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు డా॥శ్రీహరిరావు, డా॥యుగంధర్, డా॥హరికృష్ణలు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడుతూ ప్రస్తుత వైద్య రంగంలో చోటు చేసుకుంటున్న ఆధునిక పరికరాల వైద్య చికిత్సల నేపథ్యంలో పేదలకు సైతం గుండె చికిత్సలు అందించే విధానం ఇతివృత్తంగా అనేక ట్విస్టులతో,కొత్త కోణంలో రూపొందించిన చిత్రమే ఈ మహిషాసురుడన్నారు.1996లో తిరుపతిలోని ఎస్వీ మెడికల్ కళాశాలలో వైద్య విద్యను అభ్యసించిన స్థానికుడు డా॥గురుప్రసాద్ తాను హీరోగా,నిర్మాతగా రూపొందించిన ఈ చిత్రం ఈనెల 11వ తేదీ ఆదివారం తిరుపతిలో విడుదల అవుతోందని,ప్రజలందరూ సినిమా చూసి విజయవంతం చేయాలని కోరారు.ఈ సమావేశంలో చిత్ర దర్శకుడు రవికుమార్ పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

విజయపురం, జూన్ 9 ప్రభాతవార్త :



మండలంలోని జగన్నాధపురం సమీపంలో మలుపు వద్ద టిప్పర్ ఢీకొని శ్రీనివాసులుకు (62) గాయాలైన సంఘటన శుక్రవారం జరిగింది. ఎస్ఐ నరేష్ తెలిపిన మేరకు...కూలి పనులకు వెళ్లి ద్విచక్ర వాహనంపై జగన్నాధపురం వైపు వస్తున్న శ్రీనివాసులు, కన్నయ్యలను పన్నూరు వైపు వస్తున్న టిప్పర్ ఢీకొనడంతో శ్రీనివాసులు కాలుకు రక్త గాయాలయ్యాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

## ప్రభుత్వ డిగ్రీ కాలేజీకి అతిథి అధ్యాపకులు కావలెను

పుత్తూరు, జూన్ 9 ప్రభాతవార్త :

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో హిస్టరీ సబ్జెక్టును తాత్కాలిక ప్రాతిపదికన బోధించేందుకు ఒక పోస్టనకు అతిథి అధ్యాపకులు కావాలని కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ జి.శ్రీనివాసులు రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హిస్టరీ సబ్జెక్ట్‌లో పోస్ట్ గ్రాడ్యుయేషన్‌తో పాటు యుజిసి నెట్ లేదా ఎపి సెట్ విద్యార్హత కలిగి వుండాలన్నారు. పిహెచ్‌డి కలిగిన వారికి ప్రాధాన్యత వుంటుందన్నారు. అర్హతలు, ఆసక్తి వున్న అభ్యర్థులు ఈ నెల 12వ తేదీన కాలేజీలో జరిగే ఇంటర్వ్యూకు హాజరు కావాలని తెలిపారు. ఇతర వివరాలకు 9182136020 నెంబరుకు సంప్రదించాలని తెలిపారు.

## నిత్యాన్నపథకానికి రూ.3.26లక్షలు విరాళం

శ్రీకాళహస్తి,జూన్ 9 ప్రభాతవార్త :



శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి శుక్రవారం గుంటూరు జిల్లా విశాఖ నగర్‌కు చెందిన యార్లగడ్డ మౌలేశ్వరరావు కుమారుడు యార్లగడ్డ పవన్‌కుమార్,పూర్ణిమ సౌభాగ్య లక్ష్మీలు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. చైర్మెన్ చాంబర్‌లో వారు రూ.3లక్షల,26వేల 254లు అందజేసారు. అలాగే స్వామి అమ్మవార్ల శేష వస్త్రాలను అందించారు. వేదపండితులచే ప్రత్యేక దర్శనం ఏర్పాటు చేసారు.

## పుస్తకపఠనంతోనే విజ్ఞానాన్ని పెంచుకోవచ్చు

–జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్‌పర్సన్

తొట్టంబేడు, జూన్ 9 ప్రభాతవార్త :



పుస్తకపఠనంతోనే విజ్ఞానాన్ని పెంచుకోవచ్చని జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్‌పర్సన్ నైనారుమధుబాల అన్నారు. తొట్టంబేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉచిత వేసవి శిక్షణ శిబిరాన్ని శుక్రవారం ఆమె సందర్శించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని అన్ని గ్రంధాలయాల్లో నిర్వహిస్తున్న ఉచిత వేసవి శిబిరాన్ని విద్యార్థినీ విద్యార్థులు చక్కగా ఉపయోగించుకుంటున్నారని ప్రతి ఏడాది ఈశిక్షణ తరగతులు విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. విద్యార్థినీ విద్యార్థులు తమ విలువైన సమయాన్ని గ్రంధాలయాల్లో గడుపుతూ వారి అభ్యున్నతికి సమాజ శ్రేయస్సుకు ఉపయోగపడేలా అవరచుకోవాలన్నారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థినీ విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు ప్రధానం చేశారు. కార్యక్రమంలో గ్రంధాలయాధికారి ఎ.హరికృష్ణ, ఉపాధ్యాయులు జి.రమణయ్య, పాఠకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత

శ్రీకాళహస్తి, జూన్ 9 ప్రభాతవార్త :



బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆర్డీవో కెఎస్.రామారావు అన్నారు. అంతర్జాతీయ బాలకార్మిక దినోత్సవ వారోత్సవాలను పురస్కరించుకుని కరపత్రాలు మరియు గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ 18 సంవత్సరాల వయస్సులోపు ఉన్న చిన్నారులను ఎవరు పనిలో పెట్టుకున్నా వారిపై బాలకార్మిక చట్టం ప్రకారం చర్యలుతీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రగతి సిబ్బంది మాట్లాడుతూ సంస్థ ఆద్వర్యంలో శ్రీకాళహస్తి, రేణిగుంట, ఏర్పేడు మండలాల్లో వారం రోజుల పాటు అవగాహన కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రతి సిబ్బంది ప్రభాకర్ మరియు రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## దొంగపట్టాలు పట్టేది ఆయనే... ఇచ్చేది ఆయనే!

శ్రీకాళహస్తి, జూన్ 9 ప్రభాతవార్త :



దొంగపట్టాలు పట్టేది ఆయనే ఇచ్చే ఆయనే.. ఎవరో కాదు శ్రీకాళహస్తి ఇన్‌ఛార్జి తహశీల్దార్ రూప్‌చంద్ అని అంబేద్కర్‌నగర్ కమిటీ అధ్యక్షులు కూలిరవికుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈసందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ గతనెల 12వ తేదీన ఇన్‌ఛార్జి తహశీల్దార్ రూప్‌చంద్ కొంతమందికి దొంగపట్టాలు ఇవ్వడం జరిగిందని గతంలో అంబేద్కర్‌నగర్ సర్వే నంబర్ 360/1,2లో గల 42 మంది దళితులకు, మాజీ నక్సలైట్లకు 2006లో అప్పటి తహశీల్దార్ సర్దార్‌బాషా పట్టాలు మంజూరు చేశారన్నారు. అప్పటి నుంచి దళితులైన తెలిపిన 42మంది గృహాలు నిర్మించుకుంటూ ఉన్నారు. అక్కడ నీటి వసతిలేనందున కొంచెం కొంచెం పనులు చేసుకుంటూ కొందరు పనులు చేసుకుంటూ ఉన్నారని తెలిపారు. గతంలో ఎంతో మంది తహశీల్దార్‌లు వచ్చినా అంబేద్కర్‌నగర్ వాసులను ఇబ్బంది పెట్టలేదని, రెండు నెలలకు ముందు వచ్చిన ఇన్‌ఛార్జి తహశీల్దార్ రూప్‌చంద్ వారి పట్టాలపై చూపుపడి పట్టాలు రద్దుచేసి మరొకరికి ఇవ్వడం జరిగిందని చెప్పి భూమి సర్వేనంబర్ 360లో దొంగపట్టాలు ఇచ్చి ఆర్‌ఓసి నంబర్ లేకనే పోటోపై సంతకం, సీలు లేకనే ఈదఉలగుంటలో వై.మమత, పి.మాతమ్మలకు అధికారపార్టీ వారు వారికి ఇచ్చామంటూ దళితుల మధ్య వివాదాలు రేపుతున్నారన్నారని వెంటనే తహశీల్దార్‌ను తొలగించాలని దీనిపై జిల్లా కలెక్టర్‌కు పిర్యాదు చేశామన్నారు. నోటీసులు పంపకనే ఎలా తమ పట్టాలు ఎలా రద్దుచేస్తారని ప్రశ్నించారు. దీనిపై కోర్టును ఆశ్రయిస్తున్నామని తెలిపారు. దీనిపై ఆర్డీవోకు కూడా విన్నవించామన్నారు.

## బాలలను పనికి పంపడం నేరం : డీఎస్పీ

రేణిగుంట, జూన్ 9 ప్రభాతవార్త:



చదువుకోవాల్సిన పిల్లలు నిర్బంధ విద్యతకు పంపాలే తప్ప పనికి పంపడం నేరమని రేణిగుంట డీఎస్పీ భవ్యకిషోర్ అన్నారు. ప్రగతి సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాల కార్మిక వ్యతిరేక వారోత్సవాలను పురస్కరించుకుని రేణిగుంట డీఎస్పీ భవ్యకిషోర్ శుక్రవారం డీఎస్పీ కార్యాలయంలో గోడపత్రికలను ఆవిష్కరిం చారు. డీఎస్పీ మాట్లాడుతూ 18 సంవత్సరాల వయసు లోపు పిల్లలను పనికి పెట్టుకోవడం, పనులకు పంపడం చట్టరీత్య నేరమన్నారు. బడిఈడు పిల్లలను తల్లిదండ్రులు పనికి పంపకుండా బడికి పంపాలన్నారు. కార్యక్రమంలో ప్రగతి కో–ఆర్డినేటర్ తులసిరాంరెడ్డి, మండల కో–ఆర్డినేటర్ జయలక్ష్మి పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## అమ్మవారి భక్తులకు దుర్గం వారి అన్నదానం

చంద్రగిరి, జూన్ 9 ప్రభాతవార్త:



సత్యప్రమాణాలకు నెలవై కొలువుదీరిన శ్రీ మూలస్థాన ఎల్లమ్మ వారి ఆలయంలో శుక్రవారం అమ్మవారి భక్తులకు చంద్రగిరి కోట గ్రామానికి చెందిన దుర్గం దేవి, దుర్గం మునిరాజ దంపతులు అన్నదానం చేశారు. చంద్రగిరి గ్రామదేవతగా భక్తుల కోర్కెలు తీర్చే అమ్మవారి భక్తులకు అన్నదానం చేయడం అమ్మవారి ఆశీర్వాదంగా భావిస్తున్నట్లు తెలిపారు. అంతకు ముందు ఆలయ పాలక మండలి సభ్యుడు శమరపాకు వేమారెడ్డి, ఆలయ చైర్మన్ యారాశి చంద్రశేఖర్‌రెడ్డి తనయుడు యారాశి రామ్‌తేజ్ రెడ్డి సారెను స్వీకరించి అమ్మవారి దర్శన ఏర్పాట్లు గావించి, తీర్థప్రసాదాలు అందజేశారు.

## విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ : ఏఈఈ

రామచంద్రాపురం, జూన్ 9 ప్రభాతవార్త:

విద్యుత్ సమస్యలు త్వరితగతిన పరిష్కరించడానికి ప్రత్యేక చొరవ చూపుతామని ఏఈఈ హేమచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం కుప్పంబాదూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజలు తమ విద్యుత్ సమస్యలను వివరించేందుకు మండలంలోని నాలుగు విద్యుత్ సబ్ స్టేషన్లు ఫోన్ న ంబర్లు అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. నిత్యవసర, ఆపద సమయాలలో ఆయా సబ్ స్టేషన్ పరిధిలోని ప్రజలు క్రింద తెలియజేసిన మొబైల్ నంబర్లకు 8712625811 (నెత్తకుప్పం విద్యుత్ ఉపకేంద్రం), 8712625810 (కుప్పం బాదూరు విద్యుత్ ఉప కేంద్రం), 9491052106 (నడవలూరు విద్యుత్ ఉపకేంద్రం), 9490615969 (వెంకటరామాపురం విద్యుత్ ఉప కేంద్రం) తెలియజేయాలని కోరారు.

## దేశ ప్రగతి బిజెపికే సాధ్యం..!

–బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు కాయం హరినాథ్ రెడ్డి

రామచంద్రాపురం, జూన్ 9 ప్రభాతవార్త:

దేశ ప్రగతి బిజెపితోనే సాధ్యమని పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కాయం హరినాథ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మీడియా కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధిని ఎంతో ఉన్నతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మోడీ 9 ఏళ్ళ పాలన విజయవంతంపై తిరుచానూరు రాహుల్ కన్వెన్షన్ సెంటర్‌లో బిజెపి జాతీయ అధ్యక్షుడు జె.పి.నడ్డా నిర్వహించనున్న కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ళే విధంగా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. వైసిపి అవినీతి, అరాచకత్వాలను ప్రజలకు వివరించాలని కోరారు. రాష్ట్రంలో బిజెపి అధికారం చేపట్టాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఓబిసి మోర్చా అధ్యక్షుడు మునెయ్య, నాయకుడు ఛాముండేశ్వర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## అర్జీలను సంతృప్తి స్థాయిలో పరిష్కారం చూపాలి

–జాయింట్ కలెక్టర్ డికె బాలాజీ

తిరుపతి కలెక్టరేట్, జూన్ 9 ప్రభాతవార్త :

జగనన్నకు చెబుదాం స్పందన అర్జీలను క్షేత్ర స్థాయిలో కుణ్ణంగా పరిశీలించి సంతృప్తి స్థాయిలో సమస్యలను పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ డికె బాలాజీ తెలిపారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో కన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లాలోని ఆర్‌డిఓలు, తహశీల్దార్లు, సర్వేయర్లు, విఆర్‌ఓలతో రీసర్వే, విలేజ్ సర్వేర్‌ల డేటా ఎంట్రీ, జగనన్నకు చెబుదాం, మ్యూటేషన్, అసైన్‌మెంట్ ల్యాండ్స్ తదితర అంశాలపై వీడియో కన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి జగనన్నకు చెబుదాం స్పందన పై ప్రాధాన్యత ఇస్తున్న అంశం కాబట్టి అర్జీలను సంతృప్తి స్థాయిలోనే పరిష్కారం చూపాలని తెలిపారు. అందుకు తగిన విధంగా ఎండార్స్మెంట్ చేయాలని తెలిపారు. రిఓపెన్ ఎక్కువగా ఉన్న అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఓ కోదండరామి రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసులు, ఏడి సర్వేయర్ జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## గృహనిర్మాణాలు వేగవంతం చేయాలి : జిల్లా కలెక్టర్

తిరుపతి కలెక్టరేట్, జూన్ 9 ప్రభాతవార్త :



నగర పాలక పరిధిలో గృహ నిర్మాణాలు వేగవంతం కావలని తప్పనిసరి ప్రత్యేకంగా నోడల్ అధికారి నియామకంతో లక్ష్యాలు నిర్ధేశించుకుని పురోగతి ఉండేలా చూడాలని జిల్లా కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి ఆదేశించారు. శుక్రవారం ఉదయం స్థానిక కలెక్టరేట్‌లో నగరపాలక పరిధిలో నిర్మాణాలు జరుగుతున్న గృహాల పురోగతిపై నగర పాలక సంస్థ కమిషనర్ హరితతో కల్సి జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గృహ నిర్మాణాలకు నీరు, మెటీరియల్, అప్రోచ్ రోడ్లు సౌకర్యం వుందని లేబర్ కూడా అందుబాటులో ఉన్నారని ప్రణాళికా బద్ధంగా లక్ష్యాలు నిర్ధేశించి ప్రతి రోజు కనీసం స్టేజ్ కన్వర్షన్ పై మూడు సార్లుగా సమీక్షించాలని సూచించారు. మరో మూడు నెలల్లో వర్షాలు వస్తే మరల పనులు ఆగుతాయని నోడల్ అధికారి నియామకంతో గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని అన్నారు. ఇంకా దాదాపు 11 వేల మందికి ఐఐసి బ్యాంక్ ఖాతాలకు లోన్ రుణం మంజూరు చేయాల్సి ఉందని అన్నారు. పేదలకు అందించే గృహాలు ప్రత్యేక ప్రాధాన్యత నిచ్చి పురోగతి తీసుకురావాలని అన్నారు. నగర పాలక సంస్థలో మంజూరు చేసి కేటగిరి 3తో కాంట్రాక్టర్ ద్వార నిర్మాణాలు జరుగుతున్న చిందేపల్లి, జి పాలెం, కల్లూరు, ఎం. కొత్తపల్లి, సూరప్పకశం, పిసి అగ్రహారం లే ఔట్లలో వసతులు పై సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో హౌసింగ్ పిడి శ్రీనివాసులు, మున్సిపల్ ఇంజనీర్ చంద్రశేఖర్, డిఇలు విజయకుమార్ రెడ్డి, సంజయ్ కుమార్ గోమతి, దేవిక, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి, సంక్షేమం తెలుగుదేశంతోనే సాధ్యం : భానుప్రకాష్

నగరి, జూన్ 9 ప్రభాతవార్త:



భవిష్యత్‌కు గ్యారంటీ పేరుతో తెలుగుదేశం పార్టీ విడుదల చేసిన మొదటి మేనిఫెస్టోను ప్రజలకు చేరువ చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని నగరి టీడీపీ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ తెలిపారు. శుక్రవారం నగరి రైల్వేస్టేషన్ సమీపంలోని వీఎంకే కల్యాణ మండపంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క కార్యకర్త మేనిఫెస్టోలోని మహాశక్తి, తల్లికి వందనం, అన్నదాత, యువగళం, నిరుద్యోగ భృతి తదితర పథకాలను ప్రజలకు క్షుణ్ణంగా వివరించాలన్నారు. నగరి నియోజకవర్గ ప్రజలు కోరుకున్నవే తన ఏజెండా, నగరి ప్రజల కోసం నగరి అభివృద్ధి ఏజెండగా పని చేస్తానన్నారు. వైసీపీ ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను ప్రజలు ఓట్ల రూపంలో తెలుగుదేశం పార్టీకి వేసేలా చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్క తెలుగుదేశం కార్యకర్తపై ఉందన్నారు. అనంతరం మాజీ మంత్రి గాలి ముద్దుకృష్ణమనాయుడు 76వ జయంతి వేడుకలను నగరి తెలుగుదేశం శ్రేణుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి కేక్ కట్‌చేసి కార్యకర్తలకు పంచి పెట్టారు. జోహార్ ముద్దన్న, జీఎంకే అమర్ రహే నినాదాలతో ముద్దన్న అభిమానులు ఆయన చేసిన సేవలను కీర్తించడం జరిగిందన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## వాలెంటీర్ల పోస్టులకు దరకాస్తు చేసుకోండి : కమిషనర్

తిరుపతి కార్పొరేషన్, జూన్ 9 ప్రభాతవార్త :



తిరుపతి నగర పాలక సంస్థ పరిధిలోని సచివాలయాల్లో 51 వాలెంటీర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, అర్హులైన వారు ఈ నెల 18వ తేది లోపు దరఖాస్తు చేసుకోవాలని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారులు తిరుపతి పరిధిలో నివాసితులై 10 పాసై వుండాలన్నారు.

## తిరుపతి-నెల్లూరు మధ్య 12 విద్యుత్ ఏసి బస్సులు

–ప్రారంభించిన ఆర్టీసీ చైర్మన్ ఎ.మల్లికార్జునరెడ్డి

తిరుపతి ప్రెస్‌క్లబ్,జూన్ 9 ప్రభాతవార్త:



తిరుపతి–నెల్లూరు మధ్య 12 విద్యుత్ ఏసి బస్సులను ఏపిఎస్‌ఆర్టీసీ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి,జోనల్ చైర్మన్ సుప్రజారెడ్డిలు స్థానిక ఆర్టీసీ సెంట్రల్ బస్ స్టేషన్ ఆవరణలో వారి చేతుల మీదుగా బస్సుకు పూజలు నిర్వహించి,పచ్చ జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో మొదటి సారిగా 100 విద్యుత్ ఏసి బస్సులను తిరుపతి అలిపిరి డిపోకు కేటాయించడం జరిగింది.ఇందులో తిరుపతి–తిరుమల మధ్య 50,తిరుమల–రేణిగుంట విమానాశ్రయం మధ్య 14,తిరుపతి–కడప మధ్య 12,తిరుపతి–మదనపల్లి మధ్య 12,నేటి నుండి తిరుపతి–నెల్లూరు మధ్య 12 బస్సులను నడపడం జరుగుతుందన్నారు.తిరుపతి–నెల్లూరు మధ్య రోజుకు 40 సింగల్స్ తిరుగుతాయని, టికెట్ ధర పెద్దలకు 350 రూ॥గా నిర్ణయించామని రవాణా అధికారి చెంగల్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు జోన్ ఎక్జిక్యూటివ్ డైరెక్టర్ ఆదంసాహెబ్,నెల్లూరు డిపిటిఓ పివి.శేషయ్య,ఇవి ఎలక్ట్రికల్ బస్సెస్ ప్రాజెక్ట్ మేనేజర్ ప్రభాకర్,ఇతర అధికారులు పాల్గొన్నారు.

# స్వర్గీయ ముద్దుకృష్ణమ ఆశయ సాధనకు కృషి చేస్తా : గాలి జగదీష్

**పుత్తూరు, జూన్ 9 ప్రభాతవార్త :**



దివంగత నేత గాలి ముద్దుకృష్ణమనాయుడు ఆశయ సాధనకు తాను అహర్నిశలు కృషి చేస్తానని జిఎంకె ట్రస్ట్ అధినేత, ఆయన తనయుడు గాలి జగదీష్ తెలిపారు. పట్టణంలోని ఎస్సారెస్ క్రీడా మైదానంలో జిఎంకె ట్రస్ట్ ఆధ్వర్యంలో గాలి జగదీష్ యువసేన నిర్వహించిన క్రికెట్ పోటీల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. తొలుత ముద్దుకృష్ణమనాయుడు 76వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటం ముందు జ్యోతి వెలిగించి, పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా తన తండ్రి అడుగుజాడల్లో పేదల పక్షాన వుంటూ ఆయన ఆశయాలను నెరవేరుస్తానని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలను ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో తన తండ్రి జిఎంకె పేరుతో వున్న ట్రస్ట్ ద్వారా గత రెండేళ్లుగా క్రికెట్ టోర్నమెంట్‌లు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మొత్తం 120 జట్లు పాల్గొన్న టోర్నమెంట్ దిగ్విజయంగా ముగిసిందని తెలిపారు. టోర్నమెంట్‌లో విజేతగా నిలిచిన పుత్తూరు మండలం బుచ్చినాయుడుకండ్రిగ జట్టుకు మొదటి బహుమతి రూ. 2.00,000 లక్షల నగదు బహుమతి బహుకరించారు. ద్వితీయ స్థానంలో నిలిచిన నగరి మండలంలోని మాంగాడు జట్టుకు ఒక లక్ష, తృతీయ స్థానంలో నిలిచిన నింద్ర జట్టుకు రూ. 60,000 వేలు, నాల్గో స్థానం దక్కించుకున్న జట్టుకు రూ. 40,000 అందించారు. అలాగే మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎన్నికైన వారికి పది వేల రూపాయల చొప్పున బహుమతులు అందించారు. కార్యక్రమంలో నగరి నియోజకవర్గం లోని జిఎంకె ట్రస్ట్ సభ్యులు, ఇంకామణి, మాడా శ్రీనివాసరావు, దిలీప్, మునస్వామి, ఉప్పలపాటిసురేష్, మహేష్, గోపి, సాయి క్రీడాకారులు పాల్గొన్నారు.

## మార్పులు, చేర్పులతో పోలింగ్ బూత్‌ల వారీ ఓటరుజాబితా అవసరం



-కలెక్టర్‌కు టిడిపి వినతి

**తిరుపతి, జూన్ 9ప్రభాతవార్త:**

తిరుపతి నియోజకవర్గంలో పోలింగ్ బూత్‌ల వారీగా వీధి, ఇంటి డోర్‌నంబర్లు వరుస సంఖ్య ప్రకారం ఇంటెన్సివ్ రివిజన్ జరిపి ఓటరుజాబితాను ముద్రించాలని జిల్లా కలెక్టర్ కె. వెంకటరమణారెడ్డిని కోరారు. శుక్రవారం ఉదయం ఆ మేరకు తెలుగుయువత రాష్ట్ర అధికార ప్రతినిధి కంకణాల రజనీకాంత్‌నాయుడు, పవన్ కలసి జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. తిరుపతిలో నివాసముంటున్న అద్దె ఇళ్ళలోని కుటుంబ సభ్యులు ,ఓటర్లు ఇల్లు ఖాళీచేసినా అదే డోర్‌నంబర్‌తో ఇతరులకు ఓటు హక్కు కల్పిస్తున్నారని, తిరుపతిలోని 50 డివిజన్లలో ఒక పోలింగ్‌బూత్‌కు సంబంధించిన వీధి, డోర్ నంబర్లు గందరగోళంగా తప్పులు తడకగా ఉన్నాయన్నారు. ఈ విధానంలో మార్పులు చేసి ఓటరు జాబితాను తయారుచేయాలని కోరారు. తిరుపతిలో 262 పోలింగ్ బూత్‌లలో చనిపోయిన ఓటర్లు, రెండుచోట్ల ఓటర్లుగానమోదైన వాళ్ళు ఇతర రకాల ఓటర్లను గుర్తించి తొలగించాలని డిమాండ్ చేశారు. 2019నుంచి దొంగ ఓటర్లు ఎక్కువగా చేర్చారన్నారు. అయితే దీనిపై ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదన్నారు. జిల్లాగా మార్పుచేయడంతో తిరుపతిలో ఇంటెన్సివ్ రివిజన్ తప్పనిసరిగా చేసి కొత్త ఓటర్లు జాబితాలను తయారుచేయాలని కంకణాల రజనీకాంత్‌నాయుడు వినతిపత్రంలో పేర్కొన్నారు.

## మత్తు బానిసలపై పోలీసుల ఉక్కుపాదం

బహిరంగ ఖాళీప్రదేశాల్లో మద్యం, గంజాయిసేవనంపై దాడులు

**తిరుపతి, జూన్ 9ప్రభాతవార్త:**

సమయం: శుక్రవారం సాయంత్రం సుమారు 5.30గంటలు....

**ప్రాంతం:** నిత్యం జనంతో రద్దీగా ఉండే తిలక్‌రోడ్డులోని శ్రీదేవికాంప్లెక్స్‌కు ఆనుకునే ఉన్న ఖాళీస్థలం

**-సంఘటన:** నలుగురు యువకులు బహిరంగంగా మద్యం సేవిస్తూ ...గంజాయి వాడుతున్నారనే



సమాచారం. అంతే క్షణాల్లో పోలీసులకు ఫోన్‌కాల్ పోవడంతో తిరుపతి ఎస్‌పి పరమేశ్వరరెడ్డి ఆదేశాలతో తిరుపతి ఈస్టు ఎస్ఐ నాగేంద్రబాబు, ఏఎస్ఐ, సిబ్బందితో అక్కడకు చేరుకుని బహిరంగ మద్యం సేవిస్తున్న వారిపై దాడులు చేశారు. ఆ సమయంలో నలుగురు యువకులు పట్టుబడ్డారు. ఈ సంఘటనతో శ్రీదేవికాంప్లెక్స్‌లో ఒక్కసారిగా ఏం జరిగిందనే ఆతృతతో దుకాణాదారులు బయటకు వచ్చారు. ఇలాంటి సంఘటనలు నగరంలో మితిమీరడంతో పోలీసులు అప్రమత్తమ య్యారు. ఇదే తరహాలో చంద్రగిరి సబ్‌డివిజన్‌లో కూడా డిఎస్‌పి డాక్టర్ డిటి యశ్వంత్, సిఐ, ఎస్ఐలు సిబ్బందితో బహిరంగ ఖాళీస్థలాలు, పలు బంకుదుకాణాలలో తనిఖీలు చేశారు. మత్తునుంచి యువతను దూరం చేయడానికి, గంజాయి మాట వినిపించకుండా, కనిపించకుండా చూడాలని ఎస్‌పి పరమేశ్వరరెడ్డి లక్ష్యాన్ని పోలీసు అధికారులు కంకణబద్దులవడం విశేషం.

## పూతలపట్టుపై 'దేశం' కొత్త ప్రయోగం

- ఎట్టకేలకు నియోజకవర్గ ఇన్‌ఛార్జీగా మురళీ నియామకం

**చిత్తూరు, జూన్ 9 ప్రభాతవార్త:** పూతలపట్టు అసెంబ్లీ నియోజకవర్గంలో గతంలో కాంగ్రెస్, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలు చేసిన ప్రయోగాలు సత్‌ఫలితాలు ఇవ్వడం గుర్తించిన ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ ప్రస్తుతం అదే తరహా ప్రయోగానికి సిద్ధమైంది. రాజకీయాలకు ఏ మాత్రం పరిచయం లేని కొత్త వ్యక్తులను గతంలో కాంగ్రెస్, వైఎస్ఆర్ కాంగ్రెస్ పూతలపట్టు అభ్యర్థులుగా ఖరారు చేసి విజయాలను తమ ఖాతాలో వేసుకొన్నాయి. అప్పట్లో తెలుగుదేశం పార్టీలో సీనియర్‌గా వున్న మాజీ ఎమ్మెల్యే లలితకుమారికి మూడుసార్లు తెలుగుదేశం పార్టీ అధిష్టానం అభ్యర్థిత్వం కేటాయించి చేతులు కాల్చుకొంది. ప్రస్తుతం కాంగ్రెస్, వైకాపా ప్రయోగాల తరహాలోనే ప్రతిపక్ష తెలుగుదేశం నియోజకవర్గ పార్టీ ఇన్‌ఛార్జీగా రాజకీయాలకు ఏ మాత్రం పరిచయం లేని పూతలపట్టు మండలం గొడుగుచింత గ్రామంకు చెందిన మురళీని నియమించింది. మూడేళ్ళ క్రితం నియోజకవర్గ పార్టీ ఇన్‌ఛార్జీ పదవి, పార్టీ పదవికి రాజీమానా చేసి మాజీ ఎమ్మెల్యే లలితకుమారి తెర మరుగు అయ్యారు. అప్పటి నుండి పూతలపట్టు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీకి పెద్ద దిక్కు ఎవ్వరు లేకపోవడంతో ఈ నియోజకవర్గ పరిధిలో వున్న మండలాల నాయకులు చిత్తూరు నియోజకవర్గ దేశం పార్టీ నాయకులతో తమ సమస్యలు చెప్పుకొనే వారు. ఈ క్రమంలో నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జీ పదవి కోసం గత కొంత కాలంగా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రవి, సినీ నటుడు సప్తగిరి ప్రసాద్, యువ పారిశ్రామికవేత్త ముత్తు, తదితరులు తెరపైకి వచ్చారు. నియోజకవర్గ పార్టీ ఇన్‌ఛార్జీ పదవి కోసం వీరు తమ ప్రయత్నాలు సాగిస్తుండగానే చడిచప్పుడు లేకుండా పార్టీలోకి వచ్చిన మురళీ మాజీ మంత్రి అమరనాథరెడ్డి, నియోజకవర్గ ముఖ్య తెలుగుదేశం నాయకులను కలిసి ఒప్పించారు. ఈ మేరకు మురళీని నియోజకవర్గ పార్టీ ఇన్‌ఛార్జీగా అంగీకరించిన నియోజకవర్గ నేతలు మాజీ మంత్రి అమరనాథరెడ్డితో కలిసి శుక్రవారం అమరావతిలో పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడును కలిశారు. ఈ మేరకు పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు పూతలపట్టు నియోజకవర్గ పార్టీ ఇన్‌ఛార్జీగా మురళీ నియామకంకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో మురళీ నియోజకవర్గ పరిధిలోని నాయకులు, కార్యకర్తలను విస్తృతంగా కలిసి పక్కా షెడ్యూల్‌తో ముందడుగు వేస్తే నియోజకవర్గంలో పార్టీ పరిస్థితి మెరుగుపడే అవకాశం వుంది. అలా కాకుండా నియోజకవర్గ నాయకులు, మండల పార్టీ నాయకులకు ప్రాధాన్యత ఇచ్చి పార్టీని ముందుకు తీసుకెళితే గతంలో పార్టీకి లభించిన అనుభవాలే మరోసారి నియోజకవర్గంలో పునరావృతం అయ్యే అవకాశాలు వుంటాయి.

ఫోటో: 02సిటిఆర్09: పూతలపట్టు నియోజకవర్గ 'దేశం' ఇన్‌ఛార్జీగా నియమితులైన మురళీ.

## రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై పోరాటాలు: సోము వీర్రాజు

**శ్రీకాళహస్తి, జూన్ 9 ప్రభాతవార్త :**



రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై బిజెపి పోరాటం సాగిస్తుందని అయితే ప్రజా సంక్షేమానికి ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు అవసరమైనన్ని నిధులు మంజూరు చేస్తున్నామని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు సోమూ వీర్రాజు అన్నారు. శుక్రవారం ఆయన శ్రీకాళహస్తిలోని బేరివారి మండపం వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభా స్థలిని, అలాగే వేదికను పరిశీలించారు. ఆయన ఇక్కడే రెండు రోజులుగా బస చేసి ఏర్పాట్లును పర్యవేక్షిస్తున్నారు. అలాగే పట్టణంలో బహిరంగసభకు సంబంధించిన ప్రచారాన్ని స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. బహిరంగసభను విజయవంతం చేయటానికి రాష్ట్ర మీడియా ప్రతినిధి, శ్రీకాళహస్తి ఇన్‌చార్జి కోలా ఆనంద్‌కుమార్‌కు బాధ్యతలు అప్పగించారు. ఆయన తనదైన శైలిలో ఏర్పాట్లు, ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. ఇప్పటికే పట్టణంలో బిజెపి జెండాలు, బ్యానర్లు, ఇంటింటికి బిజెపి అందిస్తున్న పథకాలకు సంబందించిన కరపత్రాలను చేర్చారు.

**ప్రజా సంక్షేమానికే పెద్ద పీట:**

విలేకరుల అడిగిన పలు ప్రశ్నలకు సోమూ వీర్రాజు సమాధానం చెబుతూ కేంద్రం అందిస్తున్న నిధులను రాష్ట్ర ప్రభుత్వం తామే అభివృద్ధి సాధిస్తున్నట్లు ప్రచారం చేసుకుంటుందని ఈ తెరచాటు విధానాలపై అక్రమాలు, అవినీతిపై 'చార్జిషీట్' కార్యక్రమాలను చేపట్టామన్నారు. అయితే రాష్ట్రంలో ప్రభుత్వం కేంద్రం ఇస్తున్న నిధులను దుర్వినియోగం చేస్తుందనిచెబుతూనే మళ్ళీ నిధులు ఇస్తున్నారనే విమర్శలపై వివరణ కోరగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సంబంధాలు వేరు. ప్రజాసంక్షేమానికి నిధులు మంజూరు చేయటం వేరని అభిప్రాయం వ్యక్తం చేసారు. ప్రస్తుతం బహిరంగ సభలను నిర్వహిస్తున్నామని ఈ నెల 30 తరువాత రైతాంగం సమస్యలు, టిడ్కోఇళ్ళకు మంజూరు చేస్తున్న నిధులు, ప్రధాని పక్కాగృహాల అమలు తీరుపై సమగ్ర విచారణ జరపనున్నట్లు వివరించారు. ఉచితాలపై కేంద్ర ప్రభుత్వం పెదవి విరిస్తూ మళ్ళీ నిధులు విడుదలపై జనం విమర్శలు చేస్తున్నారనే అంశాన్ని ఆయన దృష్టికి తీసుకురాగా ప్రతిరాష్ట్రంలో ప్రజల బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉంది. వారి అభ్యున్నతికి నిధులివ్వక తప్పదని అభిప్రాయపడ్డారు. ఆదుకోవటం కేంద్ర ప్రభుత్వం బాధ్యతగా స్వీకరిస్తుందన్నారు. పోలవరానికి, ఆర్థిక పరమైన అంశాలపై దృష్టి పెడుతుంది తప్ప ప్రత్యేకత ఏమి లేదన్నారు.

**ప్రత్యేక హోదా నిరంతరం:**

ప్రత్యేక హోదా గురించి ప్రశ్నించినపుడు ఆయన స్పందిస్తూ నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నపుడు ప్రత్యేక హోదా గురించి చర్చ జరిగింది. ఆయన కోరిన 15వేల కోట్లు నిధులు అందించామన్నారు. దానికి సంబంధించి వడ్డీలు కూడా కేంద్రం చెల్లిస్తుందన్నారు. ఏర్పాట్ల పరిశీలనల్లో సోమూ వీర్రాజుతో పాటు శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌చార్జి కోలా ఆనంద్‌కుమార్, పార్టీ కో కన్వీనర్ మేళాగారం సుబ్రమణ్యం రెడ్డి, పట్టణ అధ్యక్షుడు గరికపాటి రమేష్‌బాబు, కొండేటి గోపాల్, కన్నా వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి కోనేటి అయ్యప్ప, పుణ్యం ఢిల్లిబాబు, వెంకటేశ్వర్లు ఆచారి తదితరులు పాల్గొన్నారు.

## తిరుపతిలో విద్యార్థులతో

అంతర్జాతీయ హాకీక్రీడాకారిణి రజని



తిరుపతి, జూన్ 9ప్రభాతవార్త: చలాకీగా...ఉత్సాహంగా క్రీడల్లో పాల్గొనే హాకీ క్రీడాకారిణి రజని శుక్రవారం తిరుపతిలో ఎస్వీ ఆర్ట్సు కళాశాల, పద్మావతి మహిళ జూనియర్ కళాశాల విద్యార్థులతో "ఇంటరాక్షన్ విత్ రజని"కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఆమెకు టిటిడి డిఇఒ భాస్కర్‌రెడ్డి, ఎస్వీఆర్ట్సు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నారాయణమ్మ, పద్మావతి మహిళ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భువనేశ్వరి స్వాగతం పలికారు. విద్యార్థులు నిర్దిష్టమైన లక్ష్యాలతో ఉన్నతస్థానాలకు చేరుకోవచ్చన్నారు.

## నల్లారి కిరణ్‌కు సాదర స్వాగతం

**తిరుపతి, జూన్ 9ప్రభాతవార్త:**

ఇటీవల బిజెపి తీర్థం పుచ్చుకున్న మాజీ సిఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి తొలిసారిగా శుక్రవారం రాత్రి



తిరుపతికి విచ్చేశారు. ఆయనకు తిరుపతిలో బిజెపి నాయకులు గుండాల గోపీనాథరెడ్డి, అక్కినపల్లి మునికృష్ణయ్యయాదవ్, మస్తాన్, దీపక్‌యాదవ్, సుబ్రమణ్యంయాదవ్, సుబ్రమణ్యంరెడ్డి పుష్పగుచ్చంతో స్వాగతం పలికి దుశ్శాలువతో సన్మానించారు.

## మహిళా సమస్యలు పరిష్కరించడమే లక్ష్యం

**- ప్రతి గడపకి మహిళా పోలీసే యాప్‌ను ఆవిష్కరించిన అనంతపురం రేంజ్ డిఐజి అమ్మిరెడ్డి**

**చిత్తూరు, జూన్ 9 ప్రభాతవార్త:**

మహిళల సమస్యలను వారి ద్వారా తెలుసుకొని పరిష్కరించడమే లక్ష్యంగా రాష్ట్రంలో మొదటి సారిగా ప్రయోగాత్మకంగా చేపట్టిన గడప గడపకి మహిళా పోలీస్ యాప్‌ను శుక్రవారం అనంతపురం రేంజ్ డిఐజి అమ్మిరెడ్డి ఆవిష్కరించారు. చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 5వ డివిజన్ వార్డు సచివాలయంలో శుక్రవారం అనంతపురం రేంజ్ డిఐజి అమ్మిరెడ్డి, ఎస్పీ రిశాంత్‌రెడ్డిలు గడప గడపకి మహిళా పోలీస్ యాప్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిఐజి అమ్మిరెడ్డి మాట్లాడుతూ మహిళల భద్రత, వారి రక్షణే ధ్యేయంగా ఈ కార్యక్రమంను చిత్తూరులో ప్రారంభిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి వెళ్ళే మహిళా పోలీసు సాధారణంగా కాకుండా వారితో మమేకమై, మనసుపెట్టి వారితో మాట్లాడితే వారు సమస్యలను ధైర్యంగా చెప్తారన్నారు. ఈ సర్వేలో ఉత్తమ ఫలితాలు సాధించాలంటే రేషన్‌కార్డులు, వాక్సినేషన్ తరహాలో చేపట్టే సర్వే తరహా కాకుండా వారితో ప్రేమగా మాట్లాడి వారి స్థితిగతులు తెలుసుకొని ఆపై సమస్యలు తెలుసుకొని పోలీస్ యాప్‌లో పొందుపరచాలన్నారు. సర్వేకి వెళ్ళిన సమయంలో స్థానికంగా ఎదైనా సంఘ వ్యతితిరేక కార్యక్రమాల వివరాలు తెలిస్తే వాటిని సంబంధిత పోలీస్ స్టేషన్ దృష్టికి తీసుకెళ్ళి ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ఈ సర్వేలో మహిళా పోలీసుల పాత్ర కీలకమని, వారు తమ కర్తవ్యంను పక్కాగా నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా డిఐజి అమ్మిరెడ్డి ఎస్పీ రిశాంత్‌రెడ్డితో కలిసి 5వ డివిజన్ పరిధిలోని ఇళ్ళకు మహిళా పోలీసులతో కలిసి వెళ్ళి వారితో సర్వే చేసి బ్రోచర్‌ను అందించి మహిళా చట్టాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ సగిలి షన్మోహన్, మున్సిపల్ కమీషనర్ డాక్టర్ జె.అరుణ, మేయర్ అముద, కార్పొరేటర్ హరిణిరెడ్డి, అడ్మిన్ ఎఎస్పీ సుధాకర్, ఎస్ఐబి అడిషనల్ ఎస్పీ లక్ష్మీ, దిశ డిఎస్పీ బాబు ప్రసాద్, నగర డిఎస్పీ శ్రీనివాసమూర్తి, ఎస్‌బి డిఎస్పీ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కాంట్రాక్ట్ ఉద్యోగులను నిలువునా ముంచిన ముఖ్యమంత్రి

**-టిఎన్‌టియుసి చిత్తూరు పార్లమెంట్ అధ్యక్షుడు రావిళ్ల మాధవనాయుడు**

**పుత్తూరు, జూన్ 9 ప్రభాతవార్త :**



అధికారంలోకి రాగానే కాంట్రాక్టు ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేస్తామని, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు టైమ్ స్కేల్ ఇస్తామని చెప్పిన ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి నేడు మాట తప్పి వారిని నిలువునా ముంచారని టిఎన్‌టియుసి చిత్తూరు పార్లమెంట్ అధ్యక్షుడు రావిళ్ల మాధవనాయుడు ఆరోపించారు. శుక్రవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో లక్ష మందికి పైగా కాంట్రాక్టు ఉద్యోగులుండగా కేవలం 10,117 మందినే క్రమబద్ధీకరిస్తూ ఉత్తర్వులిచ్చారని తెలిపారు. 2014 జూన్ నాటికి 5 ఏళ్ల సర్వీస్ పూర్తి చేసుకుని వుండాలనే నిబంధనతో ప్రభుత్వ ఉద్యోగం వస్తుందనుకున్న వేలాది మంది ఆశలపై నీళ్ల చల్లారని తెలిపారు. తెలంగాణాలో ఇటువంటి నిబంధన లేకుండానే వారి సర్వీసులను క్రమబద్ధీకరించాలని నిర్ణయించారని, ఆ మేరకు ఇప్పటికే 5,544 మందిని రెగ్యులరైజ్ చేశారని తెలిపారు. జగన్‌రెడ్డి పెట్టిన నిబంధన వల్ల సుమారు 1500 మంది కాంట్రాక్టు లెక్చరర్లు అవకాశం కోల్పోతున్నారని తెలిపారు. వీరితో పాటు ప్రభుత్వ రంగంలో సుమారు ఒక లక్ష మంది కాంట్రాక్టు ఉద్యోగులు కూడా నష్టపోతున్నారని, ఇది వంచన కాదా అని ప్రశ్నించారు. తెలుగుదేశం పార్టీ హయాంలో సుప్రీంకోర్టు తీర్పు మేరకు కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించడం సాధ్యం కాకపోవడం వల్ల కాంట్రాక్టు సిబ్బందికి భారీగా జీతాలు పెంచామని తెలిపారు. టిడిపి అధికారంలోకి రాగానే కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తామని తెలిపారు. సమావేశంలో చిత్తూరు పార్లమెంట్ టిఎన్‌టియుసి ప్రధాన కార్యదర్శి సుబ్రమణ్యం యాదవ్, కార్యదర్శి నిరంజన్ రెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శి బాలకృష్ణ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మహంత్ అర్జున్ దాస్ విధుల నుండి తొలగింపు!

**తిరుపతిరూరల్, జూన్ 9 ప్రభాతవార్త:**





శ్రీ స్వామి హథీరాంజీ మఠం మహంత్ అర్జున్‌దాస్ అక్రమాలకు పాల్పడుతున్నారనే అభియోగాలపై అర్జున్‌దాస్‌ను విధుల నుండి తొలగిస్తున్నట్లు జిల్లా ఎండోమెంట్ అధికారులు తెలిపారు. ఏ.పి.చారిటబుల్, హిందూ మతపరమైన సంస్థలు, ఎండోమెంట్ చట్టం 1987 లోని ప్రోసీడింగ్స్ ఆధారంగా విడుదల చేసిన అభియోగాలను 15రోజులలో అర్జున్‌దాస్ వివరణ ఇవ్వనందున ఎండోమెంట్ చట్ట ప్రకారం క్రమశిక్షణా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. హైకోర్టు ఆదేశాలు డబ్ల్యు.పి. నెం-2391/2020 వాజ్యం, ధార్మిక పరిషత్ దేవదాయశాఖ విజయవాడ ఉత్తర్వులు మేరకు అర్జున్‌దాస్‌ను మహంతు విధుల నుండి తొలగించుటకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. శుక్రవారం జిల్లా దేవదాయశాఖ అధికారి రామకృష్ణ, ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ పి.పణిరాజసేన, ఎండోమెంట్ తహశీల్ధార్, డిప్యూటీ తహశీల్దార్స్ మఠం కార్యాలయానికి వెళ్ళగా మహంత్ అర్జున్‌దాస్ అందుబాటులో లేరని, అక్కడి సిబ్బందిని విచారించగా అర్జున్‌దాస్ కార్యాలయంలో అందుబాటులో ఉండటం లేదని తెలిపినట్టు తెలిపారు. ఈ విషయాన్ని జిల్లా దేవదాయశాఖ అధికారి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళాగా తిరుపతి మండల మెజిస్ట్రేట్, తహశీల్ధార్‌ను కలిసి, సస్పెన్స్ ఉత్తర్వులను కార్యాలయ ద్వారానికి అతికించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎండోమెంట్ స్పెషల్ తహశీల్ధార్ వెంకటలక్ష్మీ, జిల్లా ఎండోమెంట్ ఆఫీసర్ రామకృష్ణ, డిప్యూటీ తహశీల్ధార్ జీవన్‌కుమార్, విఆర్వో మురళిని, సర్వేయర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## రసవత్తరంగా వైయస్సార్ క్రికెట్ టోర్నమెంట్

**-విజేతలకు రూ.5లక్షల నగదు బహుమతులు**

**-విన్నర్‌గా వడ్డిపల్లి జట్టు, రన్నర్‌గా సికె పల్లి జట్టు**

**తిరుపతిరూరల్, జూన్ 9 ప్రభాతవార్త:**

తుమ్మలగుంట గ్రౌండ్ వైయస్సార్ గ్రామీణ క్రికెట్ టోర్నమెంట్‌లో యువత చెలరేగుతూ పోటాపోటీగా బ్యాటింగ్, బౌలింగ్ చేస్తూ మైదానాన్ని మైమరిపిస్తున్నారు. శుక్రవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లలో ఎర్రవారిపాళెంకు చెందిన వడ్డిపల్లికి చెందిన జట్టు విన్నర్‌గా నిలవగా, రామచంద్రాపురం మండలానికి చెందిన సికె పల్లి జట్టు రన్నర్‌గా నిలిచింది. విజేత జట్టులకు మాజీ ఎమ్మెల్యే శ్రీనాథ్‌రెడ్డి ట్రోఫీలతో పాటు నగదు బహుమతులు అందజేసారు. తుమ్మలగుంట మైదానంలో గత 25 రోజులుగా వైయస్సార్ క్రికెట్ టోర్నమెంట్ హోరాహోరీగా జరుగుతున్న విషయం తెల్సిందే. ఈ కార్యక్రమంలో తుడా వి.సి. హరికృష్ణ, టోర్నీ నిర్వాహకులు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, రఘునాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## స్విమ్స్ నెఫ్రాలజీలో టెలీ మెడిసిన్ వ్యవస్థ ప్రారంభించాలి

**-అధికారులకు టిటిడి ఈవో ఆదేశం**

**తిరుపతి టౌన్, జూన్ 9, ప్రభాతవార్త :**



కిడ్నీ వ్యాధులతో బాధపడే వారికి తగిన సలహాలు, సూచనలు, వైద్య సహాయం అందించడానికి నెఫ్రాలజీ విభాగం టెలీ మెడిసిన్ వ్యవస్థను ప్రారంభించడానికి చర్యలు తీసుకోవాలని టిటిడి ఈవో ఎవి ధర్మారెడ్డి అధికారులను ఆదేశించారు. టిటిడి జేఈవో సదాభార్గవి, స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ వెంగమ్మతో కలిసి శుక్రవారం ఆయన నెఫ్రాలజీ, యూరాలజి విభాగాలను పరిశీలించారు. ఇన్‌పేషంట్ వార్డులు, డయాలసిస్ వార్డులు, ఐసియూ విభాగాలను పరిశీలించారు. ఇక్కడ అందిస్తున్న సేవల గురించి తెలుసుకున్నారు. ఇంటి వద్దే డయాలసీస్ చేసుకునే అవకాశం ఉండి ఆసుపత్రికి వస్తున్న రోగుల గురించి ఈవో వివరాలు తెలుసుకున్నారు. డయాలసీస్ కోసం ఉపయోగించే బ్యాగులకు డిమాండ్ ఉందని డాక్టర్లు చెప్పారు. ఏపీఎం ఐడిసి చైర్మన్ డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డితో ఈవో అక్కడి నుండే ఫోన్‌లో మాట్లాడి స్విమ్స్‌కు డయాలసీస్ బ్యాగులను పంపాలని కోరారు. రోగులతో మాట్లాడి వారి ఇబ్బందులను తెలుసుకున్నారు. డయాలసీస్ చేయించుకుంటున్న పిల్లలకు పెన్షన్ రావడం లేదని బాధితుల కుటుంబీకులు ఈవో దృష్టికి తెచ్చారు. పెన్షన్ మంజూరు చేయించడానికి తమ వైపు నుంచి సహాయం చేస్తామని ఈవో చెప్పారు. స్విమ్స్ హాస్టల్ విద్యార్థులకు ఉచితంగా అందిస్తున్న టిఫిన్, భోజనం నాణ్యత గురించి విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం ఈవో ఆయా విభాగాధిపతులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రి నిర్వహణకు సంబంధించిన సాఫ్ట్ వేర్‌లో ఎక్కడా ఇబ్బందులు ఎదురుకాకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఐటి అధికారులను ఆదేశించారు. ఆసుపత్రికి సంబంధించిన ఇంజనీరింగ్ నిర్వహణ పనులకు సంబంధించి ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులతో మాట్లాడి పనులు చేయించుకోవాలని సూచించారు. నెఫ్రాలజీ యూరాలజి విభాగాల పనితీరు బాగుందని అభినందించారు. ఈ కార్యక్రమంలో టిటిడి ఎఫ్ఏసిఏవో బాలాజీ, స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్, యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ అనిత్, డాక్టర్ శివకుమార్, డాక్టర్ నాగరాజు, జిఎం సురేష్ కుమార్, టిటిడి ఐటి జిఎం సందీప్, ఈఈ ప్రసాద్, నర్సింగ్ ఎడి ప్రభావతి పాల్గొన్నారు.

# రోడ్ల నిర్మాణానికి అన్ని క్లియరెన్స్‌లు పూర్తి : కలెక్టర్



**చిత్తూరు, జూన్ 9 ప్రభాతవార్త:**

జిల్లాలో రోడ్ల అభివృద్ధికి సంబంధిత శాఖలు అన్ని క్లియరెన్స్‌లను సత్వరం పూర్తి చేయాలని కలెక్టర్ సగిలి షన్మోహన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశపుహాలులో శుక్రవారం కలెక్టర్ సగిలి షన్మోహన్ జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, డిఆర్ఓ రాజశేఖర్‌లతో కలిసి ఎక్స్‌ప్రెస్ హైవే, జాతీయ రహదారుల నిర్మాణం, ఆర్అండ్‌బి రోడ్ల అభివృద్ధి తదితర అంశాలపై ఎన్‌హెచ్ పిడి, చిత్తూరు, నగరి, పలమనేరు ఆర్డీఓలు, విద్యుత్, ఆర్అండ్‌బి, ఉద్యానవనశాఖ, గ్రామీణ నీటి సరఫరా, పంచాయతీ రాజ్, ఎపిఐఐసి, ఇరిగేషన్ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో చెన్నై-బెంగళూరు, చిత్తూరు-తచ్చూరు ఎక్స్‌ప్రెస్ హైవే, ఎన్‌హెచ్ హైవే, ఆర్అండ్‌బి డివిజన్ రోడ్ల అభివృద్ధికి భూముల డికెటి వైయలేషన్ వంటివి సత్వరం పూర్తికి చర్యలు చేపట్టాలన్నారు. అలాగే రోడ్ల నిర్మాణానికి సంబంధించి విద్యుత్, ఆర్అండ్‌బి, ఉద్యానవనం, గ్రామీణ నీటి సరఫరా, పంచాయతీరాజ్ తదితర శాఖలు క్షేత్ర స్థాయి క్లియరెన్స్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత ఆర్డీఓలను కలెక్టర్ ఆదేశించారు. భూసేకరణ ఆలస్యంతో కొన్ని చోట్ల పనులు ఆలస్యంగా జరుగుతున్నాయని, క్షేత్ర స్థాయి సమస్యలను సత్వరం పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. బైరెడ్డిపల్లి, బంగారుపాళ్యం, గుడిపాల, పలమనేరు, యాదమరి, ఐరాల, విజయపురం, నింద్ర, చౌడేపల్లి, రొంపిచెర్ల, పులిచెర్ల, ఎస్ఆర్‌పురం, జిడినెల్లూరు మండలాల పరిధిలో అవసరమైన చోట్ల అవార్డులు, డబ్బులు అందజేయాలన్నారు.

అలాగే చిత్తూరు, గుడిపాల, తవణంపల్లి, రొంపిచెర్ల, పులిచెర్ల మండలాల్లో విద్యుత్‌శాఖ సబ్‌స్టేషన్ల నిర్మాణానికి అవసరమైన భూములను గుర్తించి వెంటనే స్వాధీనం చేయాలని తహసిల్దార్లను కలెక్టర్ ఆదేశించారు. అలాగే చిత్తూరు-తచ్చూరు రోడ్డుకు సంబంధించి భూములు ఇచ్చిన వారికి వెంటనే నోటీసులు ఇచ్చి డబ్బులు పంపిణీ చేయాలని, అవార్డ్స్ పెండింగ్‌లో లేకుండా చూడాలని ఆర్డీఓలు, తహసిల్దార్లను ఆదేశించారు. అలాగే పలమనేరు, బంగారుపాళ్యం మండలాల్లో జాయింట్ యాక్షన్ సర్వేను సత్వరం పూర్తి చేయాలన్నారు. జిల్లాలో సోమ, శుక్రవారాల్లో ఏ ఒక్క తహసిల్దారు సెలవుపై వెళ్ళడానికి వీలు లేదని అత్యవసర పరిస్థితి వుంటే కలెక్టర్, జెసిల అనుమతి తప్పనిసరిగా తీసుకొని సెలవు పెట్టాలని ఈ మేరకు ఆదేశాలు జారీ చేయాలని ఆర్డీఓలను కలెక్టర్ ఆదేశించారు.

ఈ సమావేశంలో ఎన్‌హెచ్ పిడి కార్తీక్‌రెడ్డి, ఉద్యానశాఖ డిడి మధుసూధన్‌రెడ్డి, కలెక్టరేట్ పర్యవేక్షకులు మురళీ, వెంకటేశ్వర్లు, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆర్డీఓలు, తహసిల్దార్లు పాల్గొన్నారు.